

ఈనాడు కర్నూలు
సోమవారం 21 ఆగస్టు 2017 | 16 పేజీలు

అభివృద్ధిలో నాతో ఎవరూ పోటీ పడలేరు | 98 శాతం మంది రహదారుల విస్తరణ కోరుకున్నారు | అన్ని సామాజిక వర్గాల నుంచి సమర్థ నాయకత్వం రావాలి | వాళ్లు పైకి పెద్ద మనుషులు.. చేసేది తప్పుడు పనులు | సుందర నంద్యాలే నా లక్ష్యం

నంద్యాల ఎన్నికలు ఒక చరిత్ర


ముస్లిం మహిళల ఆవేదనను వింటున్న సీఎం


ఆర్యవైశ్య ప్రముఖులతో మాట్లాడుతున్న చంద్రబాబు



కర్నూలు

'ఒక్క మాటలో చెప్పాలంటే నంద్యాల ఎన్నికలు ఒక చరిత్ర' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రెండో రోజు పర్యటనలో భాగంగా ఆదివారం ముస్లిం, వైశ్య, బలిజ సామాజిక వర్గాలు, డ్వాక్రా మహిళలు, దివ్యాంగులతో ఆయన సమావేశమయ్యారు. మొదటి రోజు రోడ్‌షోలు, ప్రసంగాలతో ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన రెండో రోజు ఆత్మీయ సమావేశాలకు ప్రాధాన్యమిచ్చారు. జోరున వర్షం పడుతున్నా... జాప్యమైనా చంద్రబాబు కోసం కార్యకర్తలు వేచి ఉన్నారు. రెండో రోజు పర్యటనలోనూ శిల్పా మోహన్‌రెడ్డి, జగన్ తీరుపై విమర్శలు ఎక్కుపెట్టారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు అన్ని సామాజిక వర్గాలకు అండగా ఉంటానని ఆయా వర్గాల్లో సీఎం ధైర్యం నింపారు.

విద్యార్థి దశలోనే సామాజిక న్యాయం

స్థానిక మున్సిపల్ టౌన్ హాలులో శాంతారామ్ ఏర్పాటు చేసిన బలిజ ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ సామాజిక న్యాయం చేయడం నేను విద్యార్థి దశలో నేర్చుకున్నానన్నారు. చదువుకునే రోజుల్లో ఎస్వీ యూనివర్సిటీలో మొట్టమొదటిసారిగా యూనివర్సిటీ ఛైర్మన్‌గా బలిజ కులస్థులను తీసుకొచ్చానంటే నాకున్న సామాజిక బాధ్యత అదీ అని గుర్తుచేశారు. అభివృద్ధిలో.. సంక్షేమంలో నాతో ఎవరూ పోటీ పడలేరన్నారు. తెదేపా నాయకత్వం నంద్యాలలో బాగా పనిచేస్తోందన్నారు. చైతన్యం, ఐకమత్యం కాపు, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాల్లో ఇంకా పెరగాలన్నారు. అన్ని కులాల నుంచి సమర్థ నాయకత్వం రావాలని, ఎక్కడైనా కొరత ఉంటే వెతికివెతికి పట్టుకొస్తానన్నారు. రాజకీయంగా కాపులను పైకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. మనసుంది.. కష్టాలున్నాయి.. అయినా కాపు పిల్లలకు రూ. 10 లక్షలు ఇచ్చి విదేశాలకు పంపుతున్నామన్నారు. బీసీల్లో చేర్చడానికి చట్ట భద్రత రావాలంటే ఒక ప్రణాళిక ప్రకారం చేయాలన్నారు. మంజునాథన్ కమిషన్ వేయకుండా చేర్చవచ్చని కొందరు చెబుతున్నారన్నారు. రాజకీయం చేయాలని వాళ్ల ఉద్దేశమని విమర్శించారు. కొందరి వల్ల రాష్ట్రంలో దుర్మార్గపు రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకు ఏ కులానికీ అన్యాయం జరగదన్నారు. దానికంటే ముందుగా నన్ను నమ్ముకున్న బలిజలకు, కాపులకు, తెలగ, ఒంటరిలకు అన్యాయం (మిగతా 2లో)

ప్రచారానికి నేడు చివరి రోజు

- 13వ రోజూ ప్రచారంలో పాల్గొననున్న జగన్
- తెదేపా శ్రేణుల ప్రచారం నేడు యథాతథం
- భారీ ర్యాలీ నిర్వహించనున్న కాంగ్రెస్

కర్నూలు, నంద్యాల: ప్రచార పర్వం తుది రోజుకు చేరుకుంది. గత నెల 24వ తేదీ నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఏకధాటిగా ప్రచారాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అధికార-ప్రతిపక్ష పార్టీలు నోటిఫికేషన్ ముందు నుంచే ప్రచారాల్లో మునిగిపోయిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి తన చివరి రోజు ప్రచారాన్ని కొనసాగించనున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభించిన ప్రచారం తుది రోజు వరకు చేస్తానని చెప్పినట్లుగానే జగన్ సోమవారం కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. ట్రాఫిక్ (మిగతా 2లో)


దూసుకొచ్చిన మృత్యువు


కుమార్‌గౌడ్ (దాచినచిత్రం)

ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, తెదేపా నేత కుమార్‌గౌడు రహదారి ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. డ్రైవరు వాహనాన్ని అతివేగంగా నడపడంతో ఈ ఘటన జరిగింది. పెద్దతుంబళం సమీపంలో కోసిగి క్రాస్ వద్ద వాహనం మూడు పల్టీలు కొట్టడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు, అభిమానులు ఆయన ఇంటికి పెద్దఎత్తున తరలివచ్చారు. 7లో

స్థానికేతరులు జిల్లా వదలివెళ్లాలి

- ✦ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ✦ ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
- ✦ జిల్లా ఎన్నికల అధికారి సత్యనారాయణ



కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నంద్యాల ఉపఎన్నిక నిర్వహణ అతిక్లిష్టమైందని, తీవ్రస్థాయిలో పోటీ ఉందని, గత ఘటనలను దృష్టిలో ఉంచుకొని సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.సత్యనారాయణ అన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేందుకు వీలుగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కసరత్తు చేశామన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రెండో జేసీ రామస్వామి, డీఆర్వో గంగాధర్‌గౌడ్, కేంద్ర ప్రభుత్వ క్షేత్రప్రచారాధికారి శివహరి నాయక్, సమాచారశాఖ డీడీ సామేల్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

☛ నియోజకవర్గంలో 2,18,858 మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 1,94,110 (88.69%) ఓటర్లకు ఓటరు స్లిప్పులు ఇచ్చామన్నారు. మిగిలిన 24,748 మంది ఓటర్లు ఏఎస్‌డీ జాబితాలో ఉంటారని, ఇందులో చనిపోయిన ఓటర్లు, వలసవెళ్లిన వారు, డూప్లికేట్ ఓటర్లు, స్థానికంగా చిరునామా దొరకనివారు ఉన్నారన్నారు. తమకు ఓటరు స్లిప్పులు ఇవ్వలేదని ఓటేసేందుకు అర్హులమని తగిన గుర్తింపుకార్డులతో అర్హులు వస్తే పరిశీలించి అనుమతి ఇస్తామన్నారు. పోలింగ్ రోజున ఓటరు గుర్తింపుకార్డుతోపాటు, ఎన్నికల సంఘం సూచించిన 12 గుర్తింపుకార్డుల్లో ఏదైనా ఒక కార్డుతో ఓటేయవచ్చన్నారు.

వీవీపాట్స్‌పై అపోహ వద్దు : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతోపాటు ఈ ఉపఎన్నికలో వీవీపాట్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటరు తాను బ్యాలెట్ యూనిట్‌పై మీట నొక్కిన వెంటనే ఏ అభ్యర్థికి ఓటేసింది పక్కనే ఉన్న వీవీపాట్స్‌లో ఏడు సెకండ్లపాటు స్క్రీన్‌పై కనిపిస్తుందన్నారు. తరువాత అక్కడే ఉన్న బాక్స్‌లో సంబంధిత కాగితం పడిపోతుందన్నారు. వీవీపాట్స్ ద్వారా ఓటు ఎవరికి వేసింది అందరికీ తెలిసిపోతుందని ఓ పత్రికలో కథనం తప్పుగా ప్రచురితమయ్యిందన్నారు. ఇందులో వాస్తవం లేదని, ఇది ఓటరుకు తప్ప మరొకరికి తెలిసే వీలులేదన్నారు. కావున ఓటర్లు నిర్భయంగా ఓటేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేటి సాయంత్రం 6 గంటలకు ప్రచారం పరిసమాప్తం : నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం సోమవారం సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందని, ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలు, పోటీలో నిలిచిన అభ్యర్థులు ప్రచారం చేయడానికి వీలులేదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కులం, మతం పేరున ఓట్లడగడానికి వీలులేదని చట్టం చెబుతోందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన వారు, స్థానికేతరులు ఎవరూ నియోజకవర్గంతోపాటు జిల్లాలో ఉండడానికి వీలు (మిగతా 2లో)



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెరిగిన భక్తుల రద్దీ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లను దర్శించుకొనేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల రద్దీ కారణంగా సోమవారం తెల్లవారుజామున జరిగే సుప్రభాతసేవ, మహామంగళహారతి సేవల టిక్కెట్ల విక్రయాలను దేవస్థానం అధికారులు నిలుపుదల చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులను దర్శనాలకు అనుమతించనున్నారు. ఆర్జిత సేవలైన అభిషేకాలను 5 గంటల నుంచి జరుపుతారు. సోమవారంతో శ్రావణమాసం ముగియనుండడంతో భక్తులు విశేష సంఖ్యలో తరలివస్తున్నారు.



గంగాధర మండపం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఇసుక ధరలు ఖరారు

కర్నూలులో ట్రాక్టర్ ధర రూ.2,250 ఇతర జిల్లాలకు తరలితే చర్యలే

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఇసుక ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. ట్రాక్టర్ల యాజమానులు ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించి విక్రయిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇసుకను ఉచితం చేసినా ప్రజలకు మాత్రం ఇసుక భారం తగ్గడం లేదు. ఇసుక రేవుల నుంచి జిల్లాలోని గృహనిర్మాణదారులకు కాకుండా కొంతమంది ఇతర జిల్లాలకు ఇసుకను తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. జిల్లాలోని ఇసుక ఇతర జిల్లాలకు తరలించడానికి వీలులేదు. ఇసుక ట్రాక్టర్లను పోలీసులు స్థానికంగా తనిఖీ చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను ఆపి డబ్బులు లేదా మరేదైనా డిమాండు చేయడం... ఆ మేరకు ట్రాక్టర్ యజామాని ఇసుక అవసరార్థులకు రూ.500 నుంచి రూ. 1000 వరకు అదనపు భారం మోపడం పరిపాటిగా మారింది. వీటిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో ఇసుక ధరల నియంత్రణకు కమిటీలను ఏర్పాటుచేసింది. ట్రాక్టర్ ఇసుకను ఎంత ధరకు విక్రయించాలో నిర్ధరించాలని ఆదేశించింది. ఆమేరకు జిల్లా కమిటీ ఛైర్మన్ ఎస్.సత్యనారాయణ, సభ్యులైన ఎస్పీ గోపినాథ్‌జెట్టి, డీటీసీ, నీటిపారుదల శాఖ ఈఈ, మెంబర్ కన్వీనర్ నటరాజుల సమక్షంలో సమావేశం జరిగింది. కిలోమీటరుకు ఎంత ధర వసూలు చేయాలన్నది నిర్ణయించారు. ఇసుక రేవుల నుంచి ఇసుక తరలింపు ధరను ఖరారు చేశారు. ట్రాక్టర్ బాడుగ రూ.వెయ్యి, లోడింగ్ ఛార్జీ క్యూబిక్‌మీటరు (3 సి.బి.ఎం) రూ.400, డ్రైవర్ బత్తా రూ.300, మొత్తం రూ.1700 నిర్ణయించారు. ఇసుక రేవు నుంచి ఐదు కిలోమీటర్ల వరకు రూ.11, 20 కిలోమీటర్ల వరకు అయితే రూ.15, 20 కిలోమీటర్లు పైబడి అయితే కిలోమీటరుకు రూ.28 చొప్పున ధర నిర్ణయిచారు.

ఆయా పట్టణాల్లో ట్రాక్టర్ ఇసుక అమ్మాల్సిన ధరలు ఇలా

కర్నూలు- రూ.2250
ఆదోని - రూ.2000
ఆత్మకూరు-రూ.2500
డోన్- రూ.3000
నంద్యాల-రూ.4500

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

నిర్దేశిత ధరలకు మించి ఇసుకను విక్రయిస్తే ఆంధ్రప్రదేశ్ చిన్న తరహా ఖనిజ నియమావళి 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఫోన్ నెంబరు: 08518-273022, చరవాణి నెంబరు: 91006 88845, పరిష్కార వేదిక టోల్‌ఫ్రీనెంబరు: 1100లకు ఫోన్‌చేసి బాధితులు ఫిర్యాదు చేయవచ్చు. కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ ఏడీ టి. నటరాజ్ ప్రచారపత్రాలను రూపొందించారు. జిల్లా కేంద్రంలో సచివాలయంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆదివారం బ్యానర్లను ప్రదర్శింపజేశారు.

జిల్లాలో ఈర్లదిన్నె, పడిదెంపాడు, పూడూరు, వేముగోడు, గుండ్రేవుల, లక్కందిన్నె, శాతానుకోట, బిజనవేముల, మద్దుటమాగిలో రెండు రీచ్‌లు, మొత్తం పది ఇసుక రేవులు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. నదిచాగి-2, నాగలదిన్నె-1, గుడికంబాలి-3, మొత్తం ఆరు రేవులకు అనుమతి రావాల్సి ఉంది. ప్రస్తుతం పది ఇసుక రేవుల నుంచి ఇసుకను తీసుకెళ్లే వీలుకల్పించారు. జిల్లాస్థాయి కమిటీ నిర్ణయించిన ధరలకు మాత్రమే ఇసుకను విక్రయించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని కలెక్టర ఎస్.సత్యనారాయణ హెచ్చరించారు.



కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఇసుక ధరల బ్యానర్

నంద్యాల ఎన్నికలు ఒక చరిత్ర

(మొదటిపేజీ తరువాయి) జరగదని హామీ ఇచ్చారు.

ఘరానా పెద్ద మనుషులు...

పదేళ్లు ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన వ్యక్తి వల్ల మీకేమైనా ఒరిగిందా? ఏమైనా చేశారా? అని ప్రశ్నించారు. ఏం చేశారో తాను చెబుతానన్నారు. ఆయనకు చాలా చరిత్ర ఉందన్నారు. పుట్టలుపుట్టలుగా అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. వీరంతా ఘరానా పెద్ద మనుషులని, పైకి మాత్రం పెద్ద మనుషులు.. చేసేది తప్పుడు పనులన్నారు. ప్రభుత్వం నుంచి రెండేసి సెంట్ల భూమి పేదలకు ఇవ్వాలంటే అందులో ఒక్కో సెంటు కొట్టేసే పరిస్థితికి వచ్చారన్నారు. బొమ్మల సత్రం వద్ద టి-జంక్షన్‌లో అవసరం లేకపోయినా ఒక ఫ్లైఓవర్ కట్టారన్నారు. దీనివల్ల ఆ ప్రాంతం అంతా ప్రాబల్యం కోల్పోయి, పూర్తిగా వ్యాపారం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. డబ్బులు వసూళ్లు చేసి అధికారాన్ని దుర్వినియోగం చేసి బయటకు పోయి వ్యాపారాలు చేశారన్నారు.

నన్ను కాల్చేస్తానంటే భయపడటం లేదు. మీకు మంచి చేయాలనుకున్నప్పుడు దుర్మార్గులు ఎన్నోవిధాల ప్రయత్నాలు చేస్తారన్నారు. ఆరోజు కూడా సాక్ష్యాత్తూ వెంకటేశ్వరస్వామి నన్ను కాపాడారన్నారు. ఒకటిరెండు కాదు 24 బాంబులు చంపడానికి పెట్టారని, వాళ్ల మనుషులకు ఫోన్లు ఇవ్వడం, లాలూచీ పడటం చేశారని గుర్తుచేశారు. నా దగ్గర డబ్బే.. లేదంటారు జగన్. మొత్తం అవినీతి సొమ్ము రూ.లక్ష కోట్లలో సీబీఐ ఛార్జిషీటు ద్వారా రూ.40 వేల కోట్లు వెలుగులోకి వచ్చింది ఎవరిదని ప్రశ్నించారు. కుందూ నంది పక్కన 50 ఎకరాల భూమి ఉంటే.. దానిని ఇందు ప్రాజెక్టుకు ఇచ్చి తీసుకున్న లంచాలను ఓ కంపెనీలో పెట్టుబడులు పెట్టారని, వారి అవినీతికి అదే సాక్ష్యమన్నారు. ఒక మనిషికి విశ్వసనీయత ఉండాలని, అభివృద్ధిని చూసే యోగ్యత, ఇంగితజ్ఞానం ఉండాలని సూచించారు.

సుందర.. నంద్యాల అందిస్తా..

చనిపోయే 24 గంటల ముందు నాగిరెడ్డి నన్ను అడిగింది నంద్యాల అభివృద్ధి. భూమా ఆత్మకు శాంతి కలగాలంటే విశాఖ, తిరుపతికి సమానంగా నంద్యాల ప్రగతి సాధించాలని, అందుకు శ్రీకారం చుట్టానన్నారు. సుందర నంద్యాలగా చేయాలని ప్రత్యేకంగా ప్యాకేజీ ఇచ్చామన్నారు. పూర్తి తాగునీటి సరఫరాతోపాటు సిమెంటు రోడ్లు వేయాలని ఆలోచిస్తున్నాన్నారు. పేదలకు 13 వేల ఇళ్లకు శ్రీకారం చుట్టిన ఘనత తెదేపా ప్రభుత్వానిది అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దీనివల్ల ఒక టౌన్‌షిప్ ఏర్పడుతుందన్నారు. రూ.3 లక్షల రాయితీ, భూమి ఉచితంగా ఇస్తున్నామని, ఈ టౌన్‌షిప్‌తో విలువ పెరుగుతుందన్నారు. మీకేమైనా సమస్య ఉంటే 1100 ఫోన్ చేస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. నంద్యాలలో రహదారుల వెడల్పు ఎన్నికల తర్వాత చేద్దామని అంటే.. ఐవీఆర్ఎస్ ద్వారా రహదారుల విస్తరణ చేయమంటారా? లేదా? అని అడిగితే 98 శాతం మంది విస్తరణ కావాలని కోరారన్నారు. ప్రజాహితం కోరి ప్రజల అభిప్రాయం తెలుసుకుని సుపరిపాలన చేస్తున్నానన్నారు. దివ్యాంగులకు తెదేపా అండగా ఉంటుందని, ఉత్తమ ప్రతిభ మీలో దాగిఉందని దివ్యాంగులను కలిసిన సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వారి కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్వయం ఉపాధిలో ఉన్న వారికి రుణాలు మంజూరు చేసి ఆదుకుంటానన్నారు. కార్యక్రమాల్లో అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, మంత్రి గంటా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు, కాల్వ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికేతరులు జిల్లా వదలివెళ్లాలి

(మొదటిపేజీ తరువాయి) లేదని, వారంతా జిల్లా వదలి వెళ్లాల్సి ఉంటుందన్నారు.

ఎవరూ ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని, సర్వేలపై నిషేధం ఉంటుందన్నారు.

23వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. నంద్యాల నియోజకవర్గంలో ఓటుహక్కు ఉన్న ప్రతి ఉద్యోగికి వేతనంతో కూడిన సెలవు ప్రకటించామన్నారు.

నంద్యాల ఉప ఎన్నికకు సంబంధించి ఇప్పటి వరకు రూ.1,08,70,650 నగదు సీజ్ చేయగా 23 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. సోమవారం సాయత్రం 6 గంటల నుంచి బుధవారం సాయంత్రం 7 గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేసినట్లు చెప్పారు.

నియోజకవర్గంలో 255 పోలింగ్ కేంద్రాలు ఉండగా 18 కిలోమీటర్ల పరిధిలో 110 ప్రాంతాల్లో 141 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మరో 74 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయన్నారు. 40 కేంద్రాలు మాత్రమే సాధారణంగా ఉన్నాయన్నారు.

ఎన్నిక నిర్వహణలో ఆరు కంపెనీల పారామిలిటరీ కేంద్ర బలగాలు, ఏపీఎస్‌పీ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా నియోజకవర్గంలో 20 రూట్లు, 28 పోలీసు మొబైల్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

53 మంది సెక్టోరల్ అధికారులు, 21 ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమించగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ రోజున వెబ్‌కాస్టింగ్ జరుగుతుందని, 255 కేంద్రాలకు సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు చెప్పారు.

నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి సరఫరా, దివ్యాంగులు ఓటేసేందుకు వీలుగా ర్యాంపులు, ఇతర కనీస వసతులు ఏర్పాటు చేశామన్నారు. నాలుగు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పీవో, ఏపీవోలకు ఇప్పటికే రెండు దఫాలుగా శిక్షణ ఇచ్చామని, సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, పోలీసు పరిశీలకులు ఇలా ముగ్గురు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించిందన్నారు.

ప్రచారానికి నేడు చివరి రోజు

(మొదటిపేజీ తరువాయి) పోలీస్‌స్టేషన్ సర్కిల్ నుంచి రోడ్‌షో ప్రారంభించి పురపాలక పార్కు, ఫాతిమా స్కూలు, బైరుమల్‌సెంటర్, పెద్దమార్కెట్, గాంధీచౌక్ ఇలా పట్టణంలోనే సాగనుంది. చాబోలు, జిల్లెల్ల, యాళ్లూరు గ్రామాల్లో రోజా పర్యటన సాగనుంది. అదేవిధంగా తెదేపా మంత్రులు కూడా చివరిరోజు ప్రచారంలో పాల్గొంటారు. ఆదినారాయణ రెడ్డి గోస్పాడు, నంద్యాల రూరల్ గ్రామాల్లో అమర్‌నాథ్‌రెడ్డి, నక్కా ఆనందబాబు, నంద్యా పట్టణంలో మంత్రులు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొంటారు. మంత్రి అఖిలప్రియ, అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి ప్రధానమైన వార్డులు, గ్రామాల్లో పర్యటిస్తారు. పట్టణంలో టీజీ వెంకటేష్, ఫరూక్‌లు తుది ప్రచారంలో పాల్గొని స్థానిక నేతలతో మాట్లాడనున్నారు. కాంగ్రెస్ తుది ప్రచారంగా నేడు సంజీవనగర్ గేటు నుంచి శ్రీనివాసనగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనుంది. రఘువీరారెడ్డి ఏకధాటిగా 13 రోజుల ప్రచారం ముగియనుంది. బరిలో ఉన్న చిన్న పార్టీలు, స్వతంత్రులు ఆటోలు, మైకుల ద్వారానే తమ ప్రచార వాణి వినిపిస్తున్నారు.

ఆరు గంటల వరకే...

ప్రచార ప్రక్రియకు సాయంత్రం ఆరుగంటల వరకే అనుమతి ఉంది. 23 ఎన్నిక తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఎన్నిక తేదీకి 48 గంటల ముందే ప్రచారాలు నిలిపివేయాలన్న నిబంధన ప్రకారం 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రచారం నిలపాల్సిందే. ఆ తర్వాత స్థానికేతరులు ఎవరూ నియోజకవర్గ పరిధిలో ఉండకూడదని నిబంధనలు చెబుతున్నాయి. దీనిప్రకారం సాయంత్రం హోటళ్లు తనిఖీ చేయనున్నారు. స్థానికులై ఆధారం చూపితేనే ఇక్కడ ఉంచుతారు. పూర్తిగా నంద్యాలను పోలీసుల వలయంలో ఉంచుతారు.

ఓటు విలువ...

ప్రచారం తుది ఘట్టంతో ఇప్పుడు వరకు స్వేచ్ఛగా ఓటు అడిగిన నేతలు నోళ్లు కట్టేసుకోవాల్సిందే. ఓట్లు పడతాయా? మన గుర్తుకే వేస్తారా? ఏదైనా హామీ ఇచ్చి మన వైపు లాక్కుందామా? అనే ఆలోచనలతో మథనపడుతూ గెలుపు తీపి రుచి చూపే ఓటు విలువ తెలుసుకోనున్నారు. ప్రచారంలో పడిన శ్రమంతా ఒక ఎత్తు అయితే ఈ రెండు రోజుల్లో కార్యకర్తలు చేయాల్సింది... ఓటు వేయించాల్సిన బాధ్యత...ఏజెంట్లుగా చేయాల్సిన పనులు కీలకమవుతాయి. ఇప్పటికే పార్టీలు ఓటుకు నోట్లు పంచుతున్నట్లు సమాచారం.

తెదేపా కార్యకర్తపై వైకాపా కార్యకర్తల దాడి

నంద్యాల గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త బాలలింగన్నపై అదే గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్తలు దాడి చేశారు. వైకాపాకు ప్రచారం చేయలేదని శనివారం సాయంత్రం బాలలింగన్నపై వైకాపా కార్యకర్తలు కృష్ణ, పెద్దన్న సహదేవుడు, మునెన్న దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితుడు ఆదివారం సాయంత్రం గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై తిమ్మారెడ్డి గ్రామానికి వెళ్లి దాడి చేసిన వారిని అరెస్టు చేశారు.

రైల్వే భద్రత పెంచుతాం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ప్రయాణికులకు భద్రత పెంచుతామని దక్షిణమధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ సూపరింటెండెంట్, సీనియర్ కమాండెంట్ సెంథిల్ అన్నారు. రైల్వే పక్షోత్సవాలు పురస్కరించుకొని రైల్వే సిబ్బందితో కలిసి ఆదివారం స్థానిక రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అనంతరం ఎన్సీసీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీపడే ప్రసక్తిలేదన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ సయ్యద్ మక్బుల్ హుసేన్, డా.సిద్దిక్, సుందర్‌రాజు, ఆర్పీఎస్ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహించండి

ఎస్పీ గోపినాథ్‌జెట్టి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసులు అప్రమత్తంగా ఉండి బాధ్యతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ గోపినాథ్‌జెట్టి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల కోసం కేటాయించిన ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. ఎన్నికల ప్రక్రియ అంతా వీడియో ద్వారా చిత్రీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద బాడీఓన్ కెమెరా, సీసీ కెమెరా, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పారామిలటరీ బలగాలతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణానికి విఘాతం కలుగజేసే వారిపై కఠిన చట్టాల కింది కేసులు నమోదు చేస్తామన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖ సమన్వయంతో ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. విధి నిర్వహణలో అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో ఓఎస్‌డీ రవిప్రకాశ్, అదనపు ఎస్పీలు వెంకటేశ్, రుషి కేశవరెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గోపినాథ్‌జెట్టి

వర్షంలోనే వైకాపా ప్రచారం

జగన్ పర్యటన సాగింది ఇలా...

నంద్యాల (నందికొట్కూరు, గడివేముల), న్యూస్‌టుడే : నంద్యాల ఉప ఎన్నికలో భాగంగా ఆదివారం వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన వర్షంలోనే కొనసాగింది. నంద్యాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగిన ప్రచారం మధ్య మధ్యలో వర్షం పడుతుండటంతో వరుణుడిని లెక్కచేయకుండా అలానే ముందుకు సాగారు. పట్టణంలోని సలీమ్‌నగర్, ప్రియాంకనగర్, డేనియల్‌పురం మీదుగా గ్రామీణ ప్రాంతాలైన నందమూరినగర్, వైఎస్సార్‌నగర్‌లో పర్యటించారు. పట్టణంలోని సలీమ్‌నగర్‌కు చెందిన కౌన్సిలర్ బాషా (చిమ్ఎింగ్)ను కలిశారు. బాషా వద్ద కింద కూర్చుని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అతని మనుమరాలితో రాఖీ కట్టించుకొని, కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగారు. ఈ కాలనీలోనే మహిళలు జగన్‌కు తిలకం దిద్దారు. దిష్టి తీసేందుకు బూడిద గుమ్మడి కాయపై కర్పూరం ఉంచి వెలిగించి తీశారు. ఈ సమయంలో జగన్ వెలుగుతున్న కర్పూరం తనపై ఎక్కడ పడుతుందోనని దూరం దూరంగా ఉన్నారు. అక్కడే ఉన్న నాయకులు గుమ్మడి కాయను తీసుకోవడంతో మామూలుగా నిల్చున్నారు. సలీమ్‌నగర్, నందమూరినగర్‌లో వాన కురుస్తున్నా జగన్ తన ప్రచారాన్ని అలానే కొనసాగించారు. ప్రచారంలో మహిళలు, వృద్ధులు, యువకులు జగన్‌తో సెల్ఫీలు దిగారు.



అభిమానులకు నమస్కరిస్తున్న జగన్

మతతత్వ పార్టీలకు స్వస్తి పలకండి

నంద్యాల, న్యూస్‌టుడే: నంద్యాల ఉప ఎన్నికల్లో మతతత్వ భాజపా పార్టీకి వంత పాడుతున్న తెదేపా, వైకాపాలకు స్వస్తి పలకాలని ఏఐసీసీ మైనార్టీ సెల్ జాతీయ అధ్యక్షుడు ఖుర్షీద్ అహ్మద్‌ఖాన్ కోరారు. ఆదివారం ఆయన నంద్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నేటికీ ఈ ప్రభుత్వం పూర్తి చేయడం లేదన్నారు. యూపీఏ హయాంలో



మాట్లాడుతున్న ఖుర్షీద్ అహ్మద్‌ఖాన్

మాట్లాడేది తక్కువ అభివృద్ధి ఎక్కువైతే, మోదీ పాలనలో మాటలెక్కువ, అభివృద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో అబద్దాల పార్టీలే అధికారంలో ఉన్నాయన్నారు. దేశాభివృద్ధికి కాంగ్రెస్ విజయమే దోహదం చేస్తుందన్నారు. ఎన్నో సంస్కరణలను అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీల భద్రతకు ఎంతగానో ప్రాధాన్యతనిచ్చిందన్నారు. రాజీవ్‌గాంధీ హయాంలో 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి నవతరాన్ని, యువతరాన్ని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం చేశారన్నారు. నంద్యాల ప్రశాంత జీవనానికి నేడు రెండు పార్టీలు గండికొడుతున్నాయని, ఆ పార్టీల మోసపూరిత మాటలను మైనార్టీలు నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీసీసీ కార్యదర్శి ఎన్.నరసింహులు, మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, అభ్యర్థి అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

ప్రచార సరళిపై దృష్టి

అక్రమాలపై ఈసీ కొరడా

తనిఖీలతోపాటు కొందరిపై వేటు

న్యూస్‌టుడే, నంద్యాల: ఎన్నికల కమిషన్ నంద్యాల ఉప ఎన్నికల ప్రచార శైలిపై దృష్టి సారించింది. ప్రచారంలో పలు అక్రమాలు చోటుచేసుకునే అవకాశముందని రాజకీయ పార్టీలు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో కొరడా విదిలించింది. ఇక డబ్బు పంపిణీ ఫిర్యాదులు ఎక్కడొచ్చినా పార్టీల నాయకుల ఇళ్లపై తనిఖీలకు పదును పెట్టింది. ఎన్నికల సంఘం ఆదేశాలతో నంద్యాల ఉప ఎన్నికల రిటర్నింగు అధికారి కె.ప్రసన్న వెంకటేష్, పరిశీలకులైన కేంద్ర ప్రభుత్వ అధికారులు హిమాంగ్షు జ్యోతిచౌదరి, ఎస్.ముకాంబికేయన్‌ల ఆధ్వర్యంలో పోలీసు బలగాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. గత కొద్దిరోజులుగా తెదేపా ఫిర్యాదుతో వైకాపా నాయకుల గృహాలపై తనిఖీలు చేసి డబ్బును స్వాధీనం చేసుకున్న అధికారులు ఈసీ ఆదేశాలతో నంద్యాలలో ఓ తెదేపా నాయకుని గృహంలో కూడా తనిఖీలు నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నంద్యాలలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలల్లో ముమ్మరంగా పాల్గొంటున్నాయి. మరోవైపు నంద్యాలకు నలుచెరలా ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాల్లో పకడ్బందీగా సోదాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం రాత్రి కలకలం రేపిన ముఖ్యమంత్రి ప్యాంట్రీ వాహనం తనిఖీలోనూ ఈసీ అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించారు. చివరకు అందులో ఏమీ లేదని తేలడంతో వదిలి వేశారు. పార్టీలకు అతీతంగా ఈసీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది. వైకాపా పలు ఆరోపణలను చేయడంతో నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణను విధుల నుంచి పక్కన పెట్టారు. మరోవైపు అభ్యర్థులు చేస్తోన్న ఖర్చుపై స్వయంగా ఎన్నికల అధికారులే పరిశీలన జరుపుతున్నారు. నియోజకవర్గమంతా తిరుగుతూ ఆ పార్టీల ప్రచార శైలి, పాల్గొన్న నాయకుల వాహన శ్రేణి, వాటి ఖర్చు, ఇతరత్రా అంశాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇరు పార్టీల నాయకులు బస చేసిన కొన్ని ప్రాంతాల వివరాలను రహస్యంగా తెప్పించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొన్ని విడిది ప్రాంతాల్లో చేస్తోన్న ఖర్చు, పాల్గొన్న ఎమ్మెల్యేలు, మంత్రులు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతరత్రా నాయకుల వివరాలను ఇప్పటికే సేకరించిన ఎన్నికల సంఘం వాటిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గత మూడ్రోజులుగా ఫిర్యాదొచ్చిన నాయకుని వివరాలను సేకరిస్తోంది.







ఉప ఎన్నిక సందర్భంగా నంద్యాలలో ప్రత్యేక బలగాల కవాతు, వాహన తనిఖీ



నంద్యాలలో ఆదివారం రాత్రి ఎల్ఈడీ దీపాలతో వైకాపా తరఫున వినూత్న ప్రచారంలో యువకులు



ఆదివారం నంద్యాలలో ముస్లిం నాయకులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తెదేపా అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న బలిజ సమావేశానికి హాజరైన ప్రతినిధులు

శ్రీశైలం

ఉచిత వైద్య శిబిరం

శ్రీశైలం, న్యూస్‌టుడే: స్థానిక దేవస్థానం వైద్యశాలలో ఆదివారం శ్రీశైల మండల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. హెపటైటిస్ 'బి' బూస్టర్ డోస్ మూడోవిడత వేశారు. ఇప్పటికే వారి ఆధ్వర్యంలో రెండు డోసులు వేసిన విషయం తెల్సిందే. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ శిబిరానికి గతంలో బూస్టర్‌డోస్ వేయించుకొన్న వారంతా హాజరై ప్రయోజనం పొందారు.

మల్లమ్మ ఆలయంలో అన్నదానం

శ్రీశైలం, న్యూస్‌టుడే: శ్రీశైలమహాక్షేత్రంలోని హేమారెడ్డి మల్లమ్మ ఆలయంలో శ్రావణమాసపు ముగింపు పూజల్లో భాగంగా కర్నాటకకు చెందిన మల్లమ్మ భక్తబృందాలు, కన్నడిగులు ఆ ప్రాంగణంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు, దేవస్థాన సిబ్బంది హాజరయ్యారు.

ఈ బంధం.. మరపురానిది

పచ్చదనంతో ఆకర్షణీయంగా పాఠశాలలు

ఆదర్శనీయం ఆంగ్లబోధన



పట్టణంలోని ఎస్సీజీ పాలెం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని పద్మావతి ఆంగ్లబోధన చేస్తూ గుర్తింపు తీసుకొచ్చారు. తరగతి గదిలో చిత్ర పటాలు, డ్రాయింగులు, పద్యాలతో పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. కృత్యధారణ విద్యతో పాటు టీఎల్ఎం సిద్ధం చేసి విద్యార్థినీ, విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో ఆంగ్ల బోధన చేస్తున్నారు. పిల్లలు ఆంగ్లంలో చదవటం, రాయటంపై మక్కువ చూపుతున్నారు. అభ్యసనా సామగ్రి అయిన పుస్తకాలు, రాతపుస్తకాలు, కలాలు, పెన్సిళ్లు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఉపాధ్యాయిని పద్మావతి పాఠశాలను వదిలివెళ్తుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, సహ ఉద్యోగులు బాధ వ్యక్తం చేస్తున్నారు.

వినూత్న కార్యక్రమాలతో ఆకర్షణ



ఇందిరానగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో వినూత్న పద్ధతుల్లో విద్యార్థినీ, విద్యార్థులకు విద్యబోధిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం పాఠశాలలో మోకాళ్ల లోతు నీళ్లు నిలిచేవి. ఇక్కడకు విద్యార్థులు రావటానికి ఆసక్తి కనపరిచేవారు కాదు. అయితే ప్రధానోపాధ్యాయుడుగా శివన్న, ఉపాధ్యాయినిగా ప్రభావతిలు వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారింది. పాఠశాలకు ప్రహరీ, వంట గది, ఒక అదనపు గది నిర్మించేలా కృషి చేశారు. అపరిశుభ్రంగా ఉన్న పాఠశాల ఆవరణలో పండ్లు, అలంకరణ మొక్కలను పెంచుతున్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేందుకు మరుగుదొడ్లు, మూత్రశాలలను సిద్ధం చేయించారు. బాలల సంఘాలు, పోస్టుబాక్సు, నిజాయితీ పెట్టె, కిడ్డీ బ్యాంకు, వర్షం, ఉష్ణమాపకాలు, ఇంకుడు గుంతలు తవ్వారు. కిడ్డీ బ్యాంకులో చిన్న పిల్లలు దాచుకున్న డబ్బులతో విహారయాత్రలకు తీసుకువెళ్తున్నారు.

ఆహ్లాదం.. పాఠశాల ఆవరణ



పట్టణంలోని సెంట్రల్ పాఠశాల ఆహ్లాద వాతావరణాన్ని తలపిస్తుంది. ఎనిమిదేళ్ల క్రితం మోకాళ్ల లోతు నీళ్లు, వృద్ధాలు, పందుల సంచారంతో పాఠశాల సతమతమయ్యేది. 2009వ సంవత్సరంలో దామరేకుల రవి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించాడు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాలలో బిలుకు తరలించి నేలను చదును చేయటం, ప్రహరీ నిర్మించటం, అదనపు గది పూర్తి చేయటం, వంట గది నిర్మించి, ఆకట్టుకునేలా చిత్రాలు, పటాలతో తరగతి గదులు తయారు చేశాడు. ప్రధానోపాధ్యాయుడితో పాటు రవికుమార్ అనే ఉపాధ్యాయుడు ఎనిమిదేళ్ల క్రితం విధుల్లో చేరాడు. అపరిశుభ్రంగా ఉన్న ఆ పాఠశాల నేడు ఆహ్లాదభరితంగా మారింది. మొక్కలతో పచ్చదనం పంచుతోంది. విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహకరంగా పుస్తకాలు, బడి బ్యాగులు, కలాలు, సమదుస్తులు అందిస్తున్నారు. పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరూ బదిలీపై వెళ్లటంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఆకట్టుకొనే రీతిలో తీర్చిదిద్దడంలో కొంతమంది ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులు ఆసక్తి కనపరుస్తున్నారు. పని చేస్తున్న పాఠశాలలో మొక్కలు పెంపకం, విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందజేయటం, హాజరు పెంచటంలో చొరవ తీసుకొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బదిలీల ప్రక్రియను ముగించింది. దీంతో ఆదర్శవంతమైన పాఠశాలల్లో పని చేస్తున్న కొందరు బదిలీ అయ్యారు. పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ కృషి చేశామని, పాఠశాలను వదిలివెళ్లటానికి మనసొప్పడంలేదని అలాంటి కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

పాఠశాల అభివృద్ధికి కృషి



పట్టణంలోని ఇస్లాంపేటలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాల సమస్యలతో సతమతమయ్యేది. గదులకు తలుపులు లేకపోవటం, బండ పరుపులు సక్రమంగా లేకపోవటం, వంట గది, ప్రహరీ లేమితో పాటు పరిసరాల్లో పెద్ద పెద్ద పిచ్చిమొక్కలు పెరిగి విద్యకు దూరంగా ఉండేది. 2009వ సంవత్సరం ఆగస్టు 28వ తేదీన పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా హుసేన్ బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలకు వచ్చినప్పటి నుంచి ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ వచ్చాడు. తక్కువగా స్థలం ఉండటంతో బయట ఆటలాడుకోవటానికి వీలుండేది కాదు. ప్రధానోపాధ్యాయుడు ఓ దాత సహకారంతో రెండు సెంట్ల స్థలం సేకరించాడు. ఆ స్థలంలో వంట గది, ప్రహరీ, నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించారు. విద్యార్థులకు పాటలు, నృత్యాలు నేర్పించటం, యోగాపై అవగాహన కల్పించారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత గంట పాటు అరబిక్ బాషపై మెలకువలు నేర్పుతున్నారు.

కూరగాయల ధరలు

(ఆదివారం, కిలో రూ.లలో): టమోటా 40, పచ్చిమిర్చి 30, వంకాయ 40, బెండకాయ 30, ఉల్లిగడ్డ 40, క్యారెట్ 50, బీట్‌రూట్ 30, చౌళికాయ 30, కాలిఫ్లవర్ 40, బీన్స్ 80, బీరకాయ 40, కాకరకాయ 30, నిమ్మకాయలు వంద 200, అల్లం 40, చిక్కుడు 40, ముల్లంగి 40, దొండకాయ 30, బంగాళదుంప 30

మాంసం ధరలు

(కిలో రూ.లలో) కోడిమాంసం 140, తోలుతీసిన కోడి మాంసం 160, పొట్టేలు మాంసం 440, చేపలు 120, కోడి గుడ్లు వంద రూ.410

నిత్యావసర వస్తువుల ధరలు

(కిలో రూ.లలో) సోనామసూరి బియ్యం 52, జొన్నలు 27, పామాయిల్ 64, వేరుశనగ నూనె 110, చక్కెర, 52, కందిబేడలు 58, తాండూరు బేడలు 70, శనగబేడలు 90, ఉప్పారవ్వ 40, బాంబేరవ్వ 38, మైదాపిండి 32, గోధుమ పిండి 28, పప్పులు 90, వేరుశనగ విత్తనాలు 100, బెల్లం 54, కొబ్బెర 160, ధనియాలు 140, చింతపండు 160, వెల్లుల్లి 80, మినప బేడలు 100

పోలీసుల నంబర్లు

సుప్రజ- డీఎస్పీ-	94407 95566
కృష్ణయ్య- సీఐ-	94407 95556
వెంకటసుబ్బయ్య- ఎస్సై-	99122 13227
లోకేష్ కుమార్- ఎస్సై-	94407 95557
అత్యవసర ఫోన్ నంబరు:	100



భక్తులతో రద్దీగా ఉన్న ఓంకారం

భక్తులతో కళకళ

బండి ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓంకార పుణ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో భక్తులు వివిధ ప్రదేశాల నుంచి ఆలయానికి వచ్చారు. ముందుగా పంచబుగ్గల కోనేరులో స్నానాలు చేశారు. గంగా ఉమాసమేత సిద్దేశ్వరస్వామి వార్లను దర్శించుకొన్నారు. ఆలయ పూజారి విశ్వేశ్వరరావు స్వామి అమ్మవార్లకు పూజాకార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తర్వాత భక్తులు వినాయక, ఆంజనేయస్వామి స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు కాశిరెడ్డినాయన అన్నసత్ర నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేశారు.

వయోజనులకు పరీక్ష

వెంగళరెడ్డిపేట (బండి ఆత్మకూరు), న్యూస్‌టుడే: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వయోజన విద్య జిల్లా పర్యవేక్షకుడు జనార్దన్ అన్నారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న వయోజన విద్య కేంద్రాల్లో వయోజనులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 390 మంది వయోజనులు పరీక్షలు రాశారన్నారు. 6, 7వ విడతల్లో సీ గ్రేడ్ సాధించిన వీరికి రెండవసారి సామర్థ్య పరీక్షలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త నడిపెన్న తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఈర్నపాడు (బండి ఆత్మకూరు), న్యూస్‌టుడే: బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ అధికారి సంజీవకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కలసపాటి వెంకటేశ్వర్లు గ్రామంలోని బస్టాండ్ సమీపంలో వెళ్తుండగా దుబ్బ కిట్టు, లక్ష్మీనారాయణ, లక్ష్మయ్య, కంబయ్య, వీరభద్రుడు, చిన్నవీరభద్రుడు, మారాజు శ్రీనివాసులు కులం పేరుతో పిలిచి దుర్భాషలాడారన్నారు. ఈ మేరకు వెంకటేశ్వర్లు ఫిర్యాదు ఇచ్చారని చెప్పారు.



ఆయుర్వేద వైద్యశాల పక్కన పడిన వృక్షం

త్రుటిలో తప్పిన ప్రమాదం

శ్రీశైలం న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలోని ఆయుర్వేద వైద్యశాల పక్కరోడ్డులోని పాత కూరగాయల బజారులో ఆదివారం ఉదయం ఓ పెద్ద వృక్షం కూలిపోయింది. చెట్టు కూలిన సమయంలో అక్కడ ఉన్న స్థానికులు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రదేశంలో ఉన్న దుకాణాలను సిద్ధి రామప్ప దుకాణ సముదాయంలోకి తరలించారు.

24 గంటల వైద్య సలహాలకు 104కు ఫోన్ చేయండి

శ్రీశైలం

ఉచితంగా గణేశ్ విగ్రహాల పంపిణీ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మండలంలోని లింగాలగట్టు గ్రామంలో ఆదివారం ఉచితంగా గణేశ్ విగ్రహాలను స్థానిక మత్స్యకారులకు అందజేశారు. విశ్వహిందూ పరిషత్తు హెల్ప్‌లైన్, మార్కాపురం ఎస్.ఎస్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేసినట్లు భజరంగ్‌దళ్ ప్రముఖ్ చెల్లూరి శివాజీ తెలిపారు.

తెరపై ఈనాడు

లక్ష్మీరంగా: నేనే రాజు నేనే మంత్రి, **రంగమహల్:** జయ జానకి నాయక, **షిర్డీ సాయి:** ఆనందో బ్రహ్మ

పత్తి రైతు నెత్తిన.. ఎర్ర గులాబి కత్తి

అప్రమత్తతే రైతుకు రక్ష | యాజమాన్య పద్ధతులు పాటించాలి | రాయితీతో లింగాకర్షక బుట్టలు



పత్తికాయను తినేస్తున్న ఎర్రగొంగళి పురుగు

ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో ఎర్ర గులాబి పురుగు ఉనికి గుర్తించిన వ్యవసాయాధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో పత్తి సాగులో ఉండటంతో ఎర్ర గులాబి పురుగు వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ సమగ్ర యాజమాన్య పద్ధతులు తెలియజేస్తున్నారు. పాములపాడు రైతు పొలాల్లో ఎర్రగులాబి పురుగుల ఆనవాళ్లు కనిపించడంతో ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,97,699 హెక్టార్లు, ఆత్మకూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 2,031 హెక్టార్లలో పత్తి సాగు చేశారు.

పురుగు ఉనికిని నిర్ధారించేందుకు గుడ్డిపూలు, కాయ పై భాగంలో పురుగు బయటకు వచ్చే గుండ్రటి చిన్న రంధ్రం, కాయ తొనల మధ్య గోడలపై గుండ్రటి రంధ్రం, గుడ్డి పత్తి, రంగు మారిన పత్తి లక్షణాలుంటాయి. గులాబి రంగు పురుగు ఉనికిని గుర్తించడానికి పంటపై ప్రత్యేక నిఘా ఉంచాలి. పొలంలో అక్కడక్కడా 50 పువ్వులను గమనించినప్పుడు వాటిలో 5 గుడ్డిపూలు ఉన్నట్లైతే అను మానించాలి. అక్కడక్కడ మొక్కకు ఒక కాయ చొప్పున 20 కాయలను సేకరించి కోసి చూసినపుడు రెండు గొంగళి పురుగులు గమనించినట్లైతే సస్యరక్షణ చేపట్టాలి.

లింగాకర్షక బుట్టలు: పత్తిలో ఎర్రగులాబి పురుగు ఉనికిని గుర్తించేందుకు రైతులు పొలంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. వరుసగా మూడు రోజులు గమనించాలి. పత్తి పంట విత్తిన 45 రోజుల నుంచి గులాబీరంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరానికి 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను అమర్చాలి. వరుసగా బుట్టలలో మూడు రోజులు 8 తల్లి రెక్కల పురుగులు పడితే.. పురుగు ఉద్ధృతిని అంచనా వేయాలి.



పత్తి పైరు

90 శాతం రాయితీపై: లింగాకర్షక బుట్టలు ఎరలను వ్యవసాయశాఖ 90 శాతం రాయితీలో అందించనుంది. ప్రస్తుతం కొత్తగా వెయ్యి లింగాకర్షక బుట్టలు కార్యాలయానికి చేరుకున్నాయి. మరో 3 వేలకు ప్రతిపాదనలు పంపారు. ఒక లింగాకర్షక బుట్ట ఖరీదు రూ.33.39 కాగా 90శాతం రాయితీపై రైతుకు రూ. 3.34 పైసలకు ఇవ్వనున్నారు. ఒక ఎర ఖరీదు రూ.10.07 కాగా రాయితీ పోను రైతుకి రూపాయికి ఇవ్వనున్నారు. రైతుకు 10 లింగాకర్షక బుట్టలు, 40 ఎరలను సరఫరా చేయనున్నారు. పురుగు 250 మీటర్ల పరిధిలో తిరుగుతుందని, ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు సరిపోతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

నివారణ చర్యలు: క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ., క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ., ప్రొఫినోఫాస్ 2 మి.లీ., థయోడికార్బ్ 1.5 గ్రాములలో ఏదో ఒకటి లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

బీటీ పత్తిలో కాయతొలుచు పురుగులను నిరోధించే జన్యువుల కారణంగా గత దశాబ్దకాలంగా శనగపచ్చపురుగు, తలనత్త, గులాబీరంగు పురుగు సోకలేదని వ్యవసాయాధికారులు తెలిపారు. గత ఏడాది నుంచే జిల్లాలోని చాలా ప్రాంతాల్లో అన్ని రకాల బీటీ పత్తి వంగడాల్లో గులాబీరంగు కాయతొలుచు పురుగు ఉనికిని గుర్తించినట్లు వారు చెప్పారు.

నష్టం అపారం

ఈ పురుగు కలిగించే నష్టం అపారం. నష్టాన్ని అంచనా వేయటం చాలా కష్టంతో కూడుకున్న పని. గొంగళి పురుగు గుడ్డు నుంచి వెలువడిన వెంటనే పూత, కాయ లోపలి భాగాల్లోకి చొచ్చుకు వెళ్లి నష్టాన్ని కలుగ చేస్తుంది. ఫలితంగా కాయ పక్వానికి రాకముందే పగిలిపోతుంది. దూది నాణ్యత, దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. కాయతొలుచు పురుగు నివారణకు వాడే సస్యరక్షణ మందుల ద్వారా దీన్ని నివారణ కష్ట సాధ్యమౌతోంది.

సస్యరక్షణ సూచిస్తున్నాం -సాలురెడ్డి, ఏడీఏ



జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఎర్రగులాబి పురుగులు దాడి చేయటం గమనించాం. పురుగు ఆశించాక నష్టాన్ని అంచనా వేయటం కష్టం. ఈ పురుగును గుర్తించటానికి పంటపై ప్రత్యేక నిఘా అవసరం. పాములపాడు మండలంలో పురుగును గుర్తించిన మేరకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించాం. రైతులు పొలంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. వ్యవసాయ శాఖ ద్వారా 90 శాతం రాయితీతో వీటిని అందించనున్నాము. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో రైతులకు సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

రైతులు పురుగు ఉనికిని, ఉద్ధృతిని గమనించి సామూహికంగా నివారణ చర్యలు చేపట్టాలి.

ఒక ప్రాంతంలో పత్తిని దఫదఫాలుగా కాకుండా ఒకే సమయంలో విత్తడం వలన పురుగు ఉద్ధృతిని తగ్గించవచ్చు.

తక్కువ కాలపరిమితి గల రకాలను ఎంపిక చేసుకుని ఒకే సమయంలో విత్తడం వలన పురుగు బెడద తప్పించుకోవచ్చు.

బీటీ పత్తితో పాటు శరణార్థక పంటగా అదే రకానికి చెందిన నాన్ బీటీ పత్తిని నిర్దేశించిన విధంగా సాగు చేయాలి.

పొలం చుట్టూ తుత్తుర బెండ, ఉమ్మెత్త లాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.

సేంద్రియ ఎరువులు, నత్రజని ఎరువుల సమతుల్యత పాటించి ఉద్ధృతిని తగ్గించవచ్చు.

సామూహికంగా లింగాకర్షక బుట్టలను అమర్చి మగ పురుగులను ఆకర్షించడం ద్వారా పురుగు ఉనికిని గుర్తించడమే కాక ఉద్ధృతిని తగ్గించుకోవచ్చు.

ట్రైకోగామా పరాన్నజీవులను ఎకరానికి 60 వేల చొప్పున పూత పూర్తిస్థాయిలో ఉన్నప్పుడు విడుదల చేయటం ద్వారా పురుగు యొక్క గుడ్డ దశను నివారించవచ్చు.

ప్రధాన పత్తి పంట పూర్తైన వెంటనే పంట విరామ సమయాన్ని పాటించాలి.

పంట తీసిన తర్వాత చేనులో గొర్రెలను, మేకలను, పశువులను వదలాలి. పత్తి తీసిన తర్వాత ఎండిన మొళ్లను, కాయలను భూమిలో కలియ దున్నుట ద్వారా పురుగు కోశస్థ దశలను నాశనం చేయవచ్చు.



సమావేశంలో పాల్గొన్న ప్రజాసంఘాలు, గ్రామాభివృద్ధి సేవా సంఘం సభ్యులు, వైద్యులు

ప్రసూతి సేవలు అందించాలి

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి సేవలు అందించాలని ఆదివారం జరిగిన సలహా సంఘ సమావేశం సూచించింది. ఉదయం జరిగిన ఈ సమావేశంలో ప్రజాసంఘాలు, గ్రామాభివృద్ధి సేవా సంఘం వైద్యులతో సమావేశమయ్యారు. ఆసుపత్రిలో అవసరమైన వసతులపై ముఖ్యంగా చర్చ జరిగింది. ఆసుపత్రిలో గైనకాలజీ, ఫిజియోథెరపి, ఆర్థో వంటి సేవలు అందించేందుకు వైద్యులు అవసరమని అభిప్రాయపడ్డారు. ఇలాంటి సేవలకు సంబంధించి వైద్యులు లేకపోవడంతో తగు వైద్యసేవలు అందడంలేదని వాపోయారు. బ్లడ్ బ్యాంకు పనిచేసేలా చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు. ఇవన్నీ విన్న ఇన్‌ఛార్జి వైద్యాధికారి శ్రీనివాసు మాట్లాడుతూ ప్రభుత్వ, ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాలు తీసుకెళ్తానని తెలిపారు.

భక్తులకు శుభవార్త

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు శుభవార్త. ఇకపై ప్రతి శని, ఆది, సోమవారాల్లో వేకువజామున 4.30 గంటల నుంచే స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నట్లు దేవస్థానం అధికారి తెలిపారు. శ్రీశైలం దేవస్థానంలోలా ఇక్కడా భక్తులకు దర్శనభాగ్యం కల్పించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రోజు ఉదయం 6 గంటల నుంచి ఒంటి గంట, 2 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రస్తుతం దర్శన సౌకర్యం ఉంది. దూరప్రాంతాల భక్తులు, యాత్రికుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని ఈ మార్పు చేసినట్లు చెప్పారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

సీతారామాపురం (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు వి.నరసింహరెడ్డి ఆదివారం ఇంట్లోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కడుపునొప్పి తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

పరిశుభ్రత.. నిరంతర పర్యవేక్షణ

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకొంటున్నాం.. ఇందులో భాగంగా పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.. వర్షాకాలం కావడంతో ముందస్తు చర్యలు చేపడుతున్నాం అంటూ కమిషనరు రమేష్‌బాబు తెలిపారు. సాంక్రమిత వ్యాధులు ప్రబలకుండా నగర శుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలన్నింటినీ అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. నగర పంచాయతీలో పరిశుభ్రత.. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న పనులపై 'న్యూస్‌టుడే'కి ఇచ్చిన ముఖాముఖీ వివరాలు ఇలా..

ప్రశ్న: నగర పంచాయతీలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు ఏమిటి?

సమాధానం: నెలలో రెండు పర్యాయాలు ఫాగింగు చేపడుతున్నాం. వార్డులన్నీ పూర్తవటానికి 15 రోజుల సమయం పడుతుంది. మురుగు కాల్వల్లో పూడిక తొలగించి వేస్ట్ ఆయిల్, బ్లీచింగు పౌడరు జల్లిస్తున్నాం. బ్లాక్‌స్పాట్ ప్రదేశాల్లో ప్రతి రోజూ చెత్తను తొలగిస్తున్నాం.

ప్రశ్న: పూడికతీత పనులు ఎలా సాగుతున్నాయి?

సమాధానం: వర్షాకాలంలో మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలంటూ రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. సుమారు 16 కిలోమీటర్ల మేర ఉన్న మురుగు కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాం. చాలా రోజులుగా ఈ పనులు చేయకపోవటం వల్ల పూడిక తీసేందుకు ఎక్కువ సమయం పడుతోంది. బస్టాండు నుంచి గుండక్కమ్మ కాలువ వరకు పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో పూడికతీత పనులు చేయిస్తున్నాం.

ముఖాముఖి

ప్రశ్న: పందుల సంచారం వల్ల పారిశుద్ధ్యం లోపిస్తోంది. అవి పట్టణంలో సంచరించకుండా తీసుకుంటున్న చర్యలేమిటి?

సమాధానం: పందులను పట్టణ శివారుకు తీసుకువెళ్లాల్సిందిగా వాటి యజమానులకు సూచించాం. మూడొంతుల మంది పందులను విక్రయించుకున్నారు. నిర్ణీత గడువులోగా పందులు తీసుకెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: 279 జీవో అమలు పనులు ఏ దశలో ఉన్నాయి?

సమాధానం: 279 జీవో ద్వారా నగర పంచాయతీలో పారిశుద్ధ్యం సమస్యలు పరిష్కరించనుంది. ప్రభుత్వం నుంచి అనుమతులు లభిస్తే టెండర్లు పిలుస్తాం.



కాలువ పనులు పరిశీలిస్తున్న కమిషనరు రమేష్‌బాబు

ప్రశ్న: పారిశుద్ధ్య విభాగంలో కార్మికులు సరిపడా ఉన్నారా?

సమాధానం: పారిశుద్ధ్య విభాగంలో ప్రస్తుతం 45 మంది కార్మికులు పని చేస్తున్నారు. కాల్వలు శుభ్రం చేయటం, చెత్తా చెదారం తొలగించటం, రోడ్లు పరిశుభ్రం చేయటానికి కార్మికులు సరిపోవటం లేదు. ఇంకా 30 మంది అవసరం ఉంది. కార్మికుల కొరతను కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లాం.

ప్రశ్న: పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణపై ఆరోపణలు వెలువడుతున్నాయి. పనులు ఎలా చేపడుతున్నారు?

సమాధానం: పారిశుద్ధ్య విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు పోస్టు ఖాళీగా ఉంది. ఇద్దరు మేస్త్రీలు ఉన్నారు. తెల్లవారుజామునే వెళ్లి ఆ పనులు పరిశీలిస్తున్నాను. అయితే ఈ పనులు సక్రమంగా జరగటంలేదంటూ ఫిర్యాదులు అందుతున్నాయి. పనులు సక్రమంగా చేయాలని కార్మికులను హెచ్చరిస్తున్నాం.

ప్రశ్న: తోపుడు బండ్ల నిర్వహణలో ఇబ్బందులు ఉన్నాయా?

సమాధానం: ఇంటింటి చెత్త సేకరణకు పది తోపుడు బండ్లు ఏర్పాటు చేశాం. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. సేకరించిన చెత్త వేసే పాయింట్లలో చెత్త నిల్వ ఉంటుంది. వెంట వెంటనే చెత్తను తొలగించటం సాధ్యం కావటం లేదు. చెత్తను తరలించటానికి మరో రెండు ట్రాక్టర్లు అవసరమవుతాయి. కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం.

ప్రశ్న: డంపింగ్ యార్డు లేక వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. అది నిర్మించేదెప్పుడు?

సమాధానం: డంపింగ్ యార్డు నిర్మాణానికి స్థలం కేటాయించాల్సిందిగా రెవెన్యూ అధికారులకు విన్నవించాం. తాత్కాలికంగా రెవెన్యూ అధికారులు సూచించిన ప్రదేశంలో చెత్తాచెదారం, వ్యర్థాలు వేస్తున్నాం.

అక్రమాలను సరి చేయాల్సిందే

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.షన్మూర్తి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: బదిలీలకు సంబంధించి అక్రమాలను సరి చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.షన్మూర్తి డిమాండు చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బదిలీల్లో నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన ఉపాధ్యాయులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీల అనంతరం సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నాటికి జిల్లా వ్యాప్త క్యాడర్ స్ట్రెంగ్త్ వివరాలను అన్ని ఉపఖజానాలకు పంపాలన్నారు. ఉద్యోగులకు శాపంగా ఉన్న కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేయాలని డిమాండు చేశారు. వేసవి సెలవుల్లో వృత్త్యంతర శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ఎఫ్.ఆర్. 82 ప్రకారం ఆర్జిత సెలవులు మంజూరు ఉత్తర్వులను వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి కోడి గుడ్లు ఒకేసారి రెండు వారాలకు సరఫరా చేయడం వల్ల అవి పాఠశాలలోనే కుళ్లిపోతున్నాయని పేర్కొన్నారు. బదిలీల అనంతరం తెలుగు, హిందీ భాషా పండితులకు స్కూలు అసిస్టెంట్ పదోన్నతులు చేపట్టాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్. పి.మౌలాలి, జిల్లా ఉపాధ్యక్షుడు జి. నాగరాజు, సి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు ఇక్బాల్ బాషా, జి.వి.రమణ, మండల శాఖ అధ్యక్షుడు జి. మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి బి. జానకీ రాముడు, ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్, నాయకులు శ్రీనివాసకుమార్, శివప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.షన్మూర్తి

ప్రశాంతంగా స్టాఫ్ అసిస్టెంట్ల నియామక పరీక్ష

కర్నూలు జిల్లాపరిషత్, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో ఖాళీగా ఉన్న స్టాఫ్ అసిస్టెంట్ల పోస్టుల నియామక భర్తీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్ష కేంద్రాలను కేడీసీసీబీ సీఈవో రామాంజనేయులు, డీజీఎంలు శివలీల, ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, గుంటూరులోని 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. పరీక్షను ఐబీపీఎస్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించారన్నారు. మొత్తం 62 పోస్టులకు 6,375 మంది దరఖాస్తు చేయగా 5456 మంది హాజరు అయ్యారన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేడీసీసీబీ ఈసీవో

అక్కడక్కడా కురిసిన వర్షాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో వారం రోజులుగా అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం జూపాడుబంగ్లా మండలంలో 13.6 మి.మీ వర్ష కురిసింది. పాములపాడు 11.4, కొత్తపల్లి 10.4, గోస్పాడు 6.8, ఆలూరు 6.4, రుద్రవరం 6, కల్లూరు 5.8, శిరువెళ్ల 4.8, దేవనకొండ, గడివేముల 4.2, కౌతాళం 4, మంత్రాలయం 3.8, ఆళ్లగడ్డ 3.6, కర్నూలు 3.4, వెలుగోడు 3.2, చిప్పగిరి 3, ఆదోని 2.2, బండిఆత్మకూరు 1.6, శ్రీశైలం 1.2, ఎమ్మిగనూరు 1 మొత్తం 19 మండలాల్లో 100.6 మి.మీ వర్షం కురిసింది. జిల్లా సగటున 1.9 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. ఈనెల సాధారణ వర్షపాతం 135 మి.మీ కాగా ఇప్పటి వరకు 71.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైర్లు పచ్చంగా కళకళలాడుతున్నాయి.

పర్యటకులను ఆకట్టుకొంటున్న ఎకో టూరిజం

మహానంది, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతను మిళితం చేసుకునే క్రమంలో ఎకో టూరిజం ఏర్పాటు చేసినట్లు సీసీఎఫ్ గోపీనాథ్ తెలిపారు. మహానంది పుణ్యక్షేత్రం దర్శనానికి ఆదివారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకో టూరిజం పర్యటకులను విశేషంగా ఆకట్టుకొంటోందని తెలిపారు. పర్యటకులు సూచనలు, సలహాలు ఇస్తే వాటిని సైతం అమలు చేయడానికి కృషిచేస్తామని చెప్పారు. ఆయనకు నంద్యాల డీఎఫ్‌ఓ శివప్రసాద్, డీఆర్వో వేణుప్రసాద్‌లు ఇక్కడి పరిసరాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలను వివరించారు. సీసీఎఫ్‌కు ఆలయ పర్యవేక్షకులు ఒ.వెంకటేశ్వర్లు మహానంది పుణ్యక్షేత్రంతో కూడిన జ్ఞాపిక అందజేసి సత్కరించారు.


మహానందిలో సీసీఎఫ్ గోపీనాథ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు

శ్రీశైలంలో నీటి మట్టం 781.20 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయంలో ఆదివారం నీటిమట్టం 781.20 అడుగుల వద్ద నీటి నిల్వ సామర్థ్యం 20.8090 టీయంసీలుగా ఉంది. 24 గంటల వ్యవధిలో జలాశయంలో 42 కూసెక్కుల నీరు ఆవిరైంది. వర్షపాతం 2.50 మి.మీ.గా నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయనికి ఇంకా నీటి ప్రవాహం ఏర్పడలేదు. స్థానికంగా ఉష్ణోగ్రతలు గరిష్టంగా 31, కనిష్టంగా 25 డిగ్రీలుగా నమోదయ్యాయి.

మహానందిని దర్శిస్తే అద్భుత శక్తి లభ్యం

మహానందిలో సినీ నటీ, ఎమ్మెల్యే రోజా

మహానంది, న్యూస్‌టుడే: మహానందిని దర్శిస్తే ప్రశాంతతో పాటు అద్భుతమైన శక్తి లభ్యమవుతుందని సినీనటి, ఎమ్మెల్యే రోజా అన్నారు. ఆదివారం ఆమె క్షేత్రానికి వచ్చి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకొని పూజించారు. ఆపై పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ పుణ్యక్షేత్రం అత్యంత పచ్చదనంతో విరాజిల్లుతూ, రమణీయతతో అలరారుతోందన్నారు. గతంలో కార్తీకమాసంలో ఓ రోజు వచ్చి దైవదర్శనం చేసుకున్నట్లుగా గుర్తుచేసుకున్నారు. వేదపండితులు రవిశంకర అవధాని తీర్థప్రసాదాలు అందజేయగా ఆలయ పర్యవేక్షకులు ఒ.వెంకటేశ్వర్లు దుశ్శాలువతో సన్మానించారు.


మహానందిలో ఎమ్మెల్యే రోజాకు ప్రసాదం అందజేస్తున్న వేదపండితులు రవిశంకర అవధాని

అదుపు తప్పి వాహనం బోల్తా

ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ కుమార్‌గౌడ్ దుర్మరణం

శోకసంద్రంలో తెదేపా నాయకులు, అభిమానులు



రోదిస్తున్న కుమార్‌గౌడ్ తండ్రి ముద్దుబసవన్నగౌడ్

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆదోని మండల పరిధిలోని పెద్దతుంబళం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆలూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడు తమ్ముడు, ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, తెదేపా నాయకుడు కుమార్‌గౌడు మృతి చెందారు. వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం షాపూర్‌లో ఉన్న పత్తి జిన్నింగ్ మిల్లుకు కుమార్‌గౌడ్ వెళ్లారు. అక్కడ పనులు చూసుకొని స్కార్పియో వాహనంలో ఆదోని బయలుదేరారు. పెద్దతుంబళం గ్రామ సమీపంలోని కోసిగి క్రాస్ వద్ద స్కార్పియో అతివేగంతో వెళుతూ అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న పొలాల్లోకి మూడుసార్లు బోల్తా కొట్టింది. ఈ ఘటనలో కుమార్‌గౌడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. డ్రైవరు రాజు తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆదోనిలోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తాలుకా సీఐ దైవప్రసాద్, ఎస్సై బాషా ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకుని ఆదోని ఆస్పత్రికి తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని ఆదోని పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆయన ఇంటికి తరలించారు. పెద్దతుంబళం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమార్‌గౌడ్‌కు భార్య రేవతి, కుమారులు మల్లికార్జున గౌడు, మంజునాథ్‌గౌడు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే నంద్యాలలో ప్రచారంలో ఉన్న వీరభద్రగౌడ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు హుటాహుటిన బయలుదేరి వచ్చారు.

పలువురి సంతాపం

తెదేపా ఆలూరు నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్‌కు అండగా ఉంటూ కుమార్‌గౌడ్ కీలకంగా వ్యవహరించేవారు. ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా, దేవరగట్టు శ్రీమాలమల్లేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. రహదారి ప్రమాదంలో ఆయన చనిపోయినట్లు తెలుసుకున్న అభిమానులు, తెదేపా నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. కుమార్‌గౌడ్ మృతి చెందడంతో ఆయన తండ్రి, తెదేపా సీనియర్ నాయకుడు ముద్దుబసవన్నగౌడు, కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తెదేపా నాయకులు ఉమాపతినాయుడు, భూపాల్‌చౌదరి, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డితోపాటు వివిధ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. డీఎస్పీ కొల్లి శ్రీనివాసరావు, సీఐలు దైవప్రసాద్, చంద్రశేఖర్, శివశంకర్ ప్రమాద వివరాలు సేకరించారు.

అతివేగమే కారణమా?

స్కార్పియో అతివేగంగా వెళ్తూ అదుపు తప్పడంతోనే రహదారి పక్క పొలాల్లో వాహనం బోల్తాపడి ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొంటున్నారు. కారు బోల్తా పడిన సమయంలో డ్రైవరు, కుమార్‌గౌడ్ కారు నుంచి బయటపడ్డారన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులోని బెలూన్లు బయటకు వచ్చాయని ఎస్సై బాషా చెప్పారు.





ప్రమాదంలో మృతి చెందిన కుమార్‌గౌడ్.. బోల్తా పడిన వాహనం

రహదారి ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

యర్రగుంట్ల (శిరువెళ్ల), న్యూస్‌టుడే : కడప కర్నూలు 18వ జాతీయ రహదారిలోని యర్రగుంట్ల వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రహదారి ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం, నంద్యాల మండలం అయ్యలూరుకు చెందిన దొమ్మరి రాముడు, కోనేటి భాస్కర్ స్నేహితులు. వీరు శనివారం రాత్రి వ్యక్తిగత పనుల మీద ఆళ్లగడ్డకు వెళ్లి పని ముగించుకుని ఆదివారం తెల్లవారుజామున స్వగ్రామానికి బయలుదేరారు. వారిద్దరూ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం యర్రగుంట్లలోని రామకృష్ణానంద గీతాశ్రమం వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కోనేటి భాస్కర్ (53) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన దొమ్మరిరాముడిని స్థానికులు 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదఘటనపై మృతుని, క్షతగాత్రుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని కూలీ దుర్మరణం

కర్నూలు నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్నూలు మండలం వెంకాయపల్లె సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో సురేష్ (29) దుర్మరణం పాలయ్యాడు. ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామానికి చెందిన మృతుడు కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య మల్లేశ్వరి, కుమార్తె ఉన్నారు. ద్విచక్ర వాహనంపై వెంకాయపల్లె దాటి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోవటంతో మృతుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకొని శోకసంద్రంలో మునిగిపోయారు. కర్నూలు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో..

డోన్, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజా టాకీస్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో గోపాల్ అనే వ్యక్తి ఆదివారం మృతిచెందారు. డోన్‌లోని ఓ హోటల్‌లో కొంత కాలం కిందట పని చేశారని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం డోన్ ఆసుపత్రికి తరలించారు. అతని పూర్తి వివరాలు తెలియలేదని పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ గౌస్ తెలిపారు.

తొమ్మిది తులాల బంగారం చోరీ

వెంగలాంపల్లె (ప్యాపిలి), న్యూస్‌టుడే : ప్యాపిలి మండలం వెంగలాంపల్లె గ్రామంలో ఓ ఇంట్లో జరిగిన దొంగతనంపై ఆదివారం ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 15న గ్రామానికి చెందిన మెట్టుపల్లె పెద్ద పులికొండ కుంటుబసభ్యులతో కలిసి పొలానికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన పులికొండకు ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లో వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దొంగతనం జరిగిందని గ్రహించారు. ఇంట్లో దాచుకున్న 9 తులాల బంగారం చోరీకి గురి కావడంతో సమాచారాన్ని ప్యాపిలి పోలీసులకు తెలిపారు. దీనిపై గ్రామస్థులతో విచారణ చేసిన ఎస్ఐ తిమ్మయ్య బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థిని మృతిపై కొనసాగిన ఆందోళన

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థిని ప్రీతిబాయి మృతికి కారణమైన కట్టమంచి పాఠశాల యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండు చేశారు. కర్నూలు గ్రామీణ పోలీసుస్టేషన్ సీఐ మహేశ్వరరెడ్డి ఆదివారం ఉదయం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థిని మృతదేహానికి శవపరీక్ష చేయించి తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం వారు కలెక్టరేట్ చేరుకొని కట్టమంచి అధినేత జనార్దన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘటన జరిగి 20 గంటలైనా నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదని విమర్శించారు. జిల్లా విద్యాధికారిణి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంటులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి పాఠశాలపై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలిక మృతికి నిరసనగా సోమవారం పాఠశాలలకు బంద్‌కు పిలుపు నిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. ఆందోళనలో ఆయా విద్యార్థి సంఘాల నేతలు ఆనంద్, నాగరాజు, అక్బర్, రామన్న, శివ, రామకృష్ణ, శ్రీనివాసులు, కారుమంచి, చంద్రప్ప, శ్రీరాములు, భాస్కర్, రామన్న, రామనాయక్, గుండాల నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు రక్షణ కల్పించాలి

కర్నూలు (విద్య, నేరవార్తలు), న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిపై పట్టపగలు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు హత్యాయత్నం చేయడం దుర్మార్గమైన చర్యని, ఈ ఘటనతో ప్రైవేట్ పాఠశాలల మనుగడ అందోళనకరంగా మారిందని ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.కృష్ణారెడ్డి ఖండించారు. ఆదివారం స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. అంతకుముందు శనివారం కట్టమంచి పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని ప్రీతిబాయి ఆత్మహత్యకు సంతాపం తెలుపుతూ రెండునిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఒత్తిడి పెరగకుండా ఆత్మస్థైర్యం పెంచేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలకు చర్యలు తీసుకుంటామని, మృతిచెందిన విద్యార్థిని తల్లిదండ్రులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి అసాంఘిక చర్యలను కట్టడిచేసి ప్రైవేట్ పాఠశాలలకు రక్షణ కల్పించి, దాడికి పాల్పడిన నాయకులను అరెస్టుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హేయమైన దాడికి నిరసనగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నామని, ఈనెల 24న రాష్ట్రస్థాయిలో బంద్ చేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశం అనంతరం సంఘం నాయకులు మాంటిస్సోరి పాఠశాల నుంచి మూడో పట్టణ పోలీసు స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి సీఐకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పుల్లయ్య, రాష్ట్ర నాయకులు రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, మనోహర్‌రెడ్డి, వావిలాల కృష్ణమూర్తి, లీలారెడ్డి, రవిప్రకాష్ పాల్గొన్నారు.

నేడు జిల్లా.. 24న రాష్ట్రవ్యాప్త బంద్

సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎ.కృష్ణారెడ్డి

విద్యార్థి నాయకులపై ఫిర్యాదు

జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరెడ్డి ఆదివారం మధ్యాహ్నం కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్ సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. కట్టమంచి విద్యార్థిని ప్రీతిబాయి మృతి వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చిన ఈయనపై విద్యార్థి సంఘాల నాయకులు దాడిచేసిన సంగతి విదితమే. ఈమేరకు ఆసుపత్రిలో చికిత్స పొందిన ఈయన తనపై జరిగిన దాడిపై ఫిర్యాదు చేశారు. పలు విద్యార్థి సంఘాల నాయకులు అకారణంగా తనపై దాడికి పాల్పడ్డారని, దాడి చేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆనంద్, శివ, రఫి, రమణ, ధనుంజయుడు, రామచంద్ర నాయక్ మరికొందరు ఉన్నారని పేర్కొంటూ చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని కోరారు. దాడి ఘటనకు సంబంధించిన వీడియో సీడీని సమర్పించారు.

విచారణకు త్రిసభ్య కమిటీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ప్రీతిబాయి (15) ఆత్మహత్యకు దారి తీసిన ఘటనపై విచారణకు కలెక్టర్ ఎస్.సత్యనారాయణ త్రిసభ్య కమిటీ వేశారు. ఆర్డీఓ డి.హుస్సేన్ సాహెబ్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ ప్రసాదరావు, జిల్లా విద్యాధికారి తహెరా సుల్తానా సభ్యులుగాగల కమిటీని విచారణకు ఆదేశించారు. మూడు రోజుల్లో విద్యార్థిని మృతికిగల కారణాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. ప్రీతిబాయి దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెండో జేసీ రామస్వామి ఆధ్వర్యంలో విద్యార్థిని కుటుంబ సభ్యులకు రూ.10వేల చెక్కును కలెక్టర్ అందజేశారు.

ప్లకార్డు పట్టు.. వర్షానికి అడ్డుపెట్టు



ముఖ్యమంత్రి సభలో వర్షం రావడంతో ప్లకార్డులు పట్టుకుని పరుగెడుతున్న జనం

నంది 'జ్ఞాపకం'.. నాలుగు కాలాలు..



ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న బలిజ నాయకులు

సార్.. సమయం అవుతోంది..!



సమయం చూసుకుంటున్న ఎమ్మెల్సీ ఎన్‌ఎండీ ఫరూక్

తడిసి ముద్దయినా.. తప్పదు మరి



వర్షంలో అభివాదం చేస్తున్న వైకాపా అధ్యక్షుడు జగన్

అమ్మా.. ఆదరించండి



ఓటు అడుగుతున్న వైకాపా అభ్యర్థి కూతురు శిల్పా

దివ్యాంగులకు బాబు భరోసా



దివ్యాంగుల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

గెలుపు దారి సరిగా ఉండాలి



ప్రచారంలో పాల్గొన్న భూమా నాగిరెడ్డి చిన్న కూతురు నాగమౌనిక

యువ మంత్రం

- ఫలితాలను ప్రభావితం చేయనున్న యువత
- నియోజకవర్గంలో 39 శాతం వాటా వారిదే
- ప్రధాన పార్టీలు వీరిపైనే ఆశలు

ఉరకలెత్తే వయస్సు.. కచ్చితంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓపిగ్గా నిల్చుండి ఓటు వేసే 'యువ' తరంగం ప్రతిష్ఠాత్మక ఎన్నికలను ప్రభావితం చేయబోతోంది. కాలమాన పరిస్థితులను అవగాహన చేసుకోవడంతో భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు సాక్షి భూతంగా నిలిచే యువజనుల ఓటు తంత్రం ఉప ఎన్నికల్లో కీలకంగా మారింది. నియోజకవర్గంలో సుమారు లకారం వరకు ఉన్న ఈ ఓటర్ల తీర్పు ఎలాగుంటుందోనన్న ఆసక్తి రెండు ప్రధాన పార్టీల్లో నెలకొంది. ప్రస్తుత పరిణామాలను నిశితంగా గమనిస్తున్న యువ ఓటర్లు తమ 'తీర్పు' ఎటో ఇప్పటికీ ఒక నిర్ణయానికి రావడం పోటీ అభ్యర్థుల్లో మరింత గుబులు రేపుతోంది.

- న్యూస్‌టుడే,నంద్యాల పట్టణం

నియోజకవర్గంలో 2,18,858 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,07,778 కాగా, మహిళల ఓటర్లు 1,11,018 ఇతరులు 62 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో 39 శాతం మంది యువ ఓటర్లే. 18 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న ఓటర్లు 83 వేలకుపైగా ఉన్నారు. వీరు ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికలో గెలుపు ఓటములను నిర్ణయించే 'కీ'లక స్థానంలో ఉన్నారు. నియోజకవర్గం మొత్తం మీద వీరి ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలైన తెదేపా, వైకాపాలు వీరి మద్దతు పొందడానికి ఉప పోరు ప్రారంభమైన తొలి నాళ్ల నుంచే తంటాలు పడుతున్నాయి.



'యువత'లో కూడా పురుష ఓటర్లు 48 శాతం కాగా, మహిళా ఓటర్లు 52 శాతం ఉండటం విశేషం. నియోజకవర్గంలోని నంద్యాల పట్టణం, మండలం, గోస్పాడు మండలాల్లోని అన్ని గ్రామాల్లో కూడా యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఇప్పటికే చాలా వరకు యువ ఓటర్లు తెదేపా, వైకాపాలుగా విడిపోయి ప్రచారాల్లో పాల్గొంటున్నా, ఎటూ మద్దతు తెలపకుండా తటస్థంగా ఉన్న ఓటర్లు వేల సంఖ్యలో ఉండటంతో వీరి ఓట్లు ఎటు పడతాయోనన్న ఆందోళన ప్రధాన పార్టీల్లో నెలకొంది. ప్రత్యేకించి నంద్యాల పట్టణంలో ఈ ఓటర్లు అధికంగా ఉండటం, వీరి మొగ్గు ఎటు వైపో తెలియకపోవడంతో ఉత్కంఠగా మారింది.



'యువ'త మస్కా కిస్కా

నియోజకవర్గ తాజా ఎన్నికల గణాంకాల ప్రకారం 83,166 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషుల ఓటర్లు 39,919 కాగా, మహిళల ఓట్లు 43,246 ఓట్లు ఉన్నాయి. ఈ మొత్తం ఓట్లలో 65 శాతం నంద్యాల పట్టణంలోనే ఉన్నాయి. పట్టణంలో 1,42,628 ఓట్లు ఉండగా ఇందులో 58 వేలకుపైగా ఓటు యువతవే ఉండటం గమనార్హం. ఈ ఓటర్లలో అక్షరాస్యత 94 శాతం ఉంది. ఇక నంద్యాల మండలంలో 47,386 మంది ఓటర్లు ఉండగా 14 వేలకుపైగా యువ ఓటర్లు ఉన్నారు. మండలంలోని గ్రామీణ యువ ఓటర్లలో అక్షరాస్యత శాతం 76 శాతంగా ఉంది. గోస్పాడు మండలంలో మొత్తం ఓట్లు 28,844 ఉండగా ఇక్కడ సుమారు 10 వేల వరకు యువ ఓటర్లు ఉన్నారు. వీరి అక్షరాస్యత శాతం 72గా ఉంది. నియోజకవర్గంలో మొత్తం మీద సుమారు 40 శాతం వరకు ఉన్న యువ ఓటర్ల మదిని దోచుకోవడానికి తెదేపా, వైకాపాలు తమ పార్టీలోని యువ నాయకులతో ప్రచారం చేయడంతోపాటు ఈ వర్గం మనస్సును గెలుచుకోవడానికి వారి కోసం అమలు చేస్తున్న, చేయనున్న సంక్షేమ పథకాలను వల్లె వేస్తూ ప్రచారం నిర్వహించాయి. మరో వైపు ఈ ఎన్నికల్లో సుమారు 13 వేల మంది యువత తొలిసారి ఓటు వేయనుంది. ఉప ఎన్నికల ప్రకటన వెలువడే వరకు కొత్తగా ఓటు కోసం 15 వేల మందికిపైగా దరఖాస్తు చేసుకోగా 9,925 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో 70 శాతం మంది యువ ఓటర్లే ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎక్కడెక్కడ ఎక్కువంటే..

నంద్యాల పట్టణంలో 58 వేలకు పైగా యువ ఓటర్లు ఉన్నారు. ఈ వర్గం ఓటర్లు ఎక్కువగా ఎన్జీవో కాలనీ, నడిగడ్డ, అరుంధతినగర్, దేవనగర్, మిషన్ కాంపౌండ్, బొమ్మలసత్రం, రెవెన్యూ క్వార్టర్లు, టెక్కె, ఎస్బీఐ కాలనీ, బాలాజీ కాంప్లెక్స్, ఫరూక్‌నగర్, ఉప్పరిపేట, సలీంనగర్, పద్మావతినగర్, సాధిక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్నారు. నంద్యాల మండలం రైతునగరం, కాంతినగర్, అయ్యలూరు, చాబోలు, కానాల, పొన్నాపురం, గోస్పాడు మండలం గోస్పాడు, దీబగుంట్ల, నెహ్రూనగర్, యాళ్లూరు తదితర ప్రాంతాల్లో ఉన్నారు. ఇటీవల కొత్తగా ఓటర్ల జాబితాలో చేరిన వారిలో కూడా నంద్యాల పట్టణం నుంచే ఎక్కువగా ఉన్నారు. కొత్తగా చేరిన ఓటర్లతోపాటు పాత యువ ఓటర్లలో అక్షరాస్యత శాతం ఎక్కువగా ఉండటంతో వీరి చేసే ఓటింగ్ విలక్షణంగా ఉండబోతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. విద్యాధికులు ఎక్కువగా ఉంటే ఈ వర్గం ఓటర్లు ఇచ్చే తీర్పు ఎలాగున్నా ఇంటిల్లిపాదిని కూడా వీరు ప్రభావితం చేసే అవకాశాలను కూడా కొట్టి పారేయలేం. దీంతో ప్రధాన పార్టీలు రెండూ నామపత్రాలు, రోడ్‌షోలు, ప్రదర్శనలు, బహిరంగ సభల్లో వీరు ఎక్కువగా కనిపించే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా రెండు పార్టీలు వీరి చరవాణులకు సంక్షిప్త సందేశాలను పంపిస్తున్నాయి. 'ఆండ్రాయిడ్ చరవాణుల' ప్రచారంతో వారికి చేరువగా వస్తున్నాయి.

రాజకీయ ఉచ్చులో సామాజిక చిచ్చు

- రెండుగా విడిపోయిన వర్గాలు

నంద్యాల, న్యూస్‌టుడే: ఉప ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గంలోని కీలకమైన సామాజిక వర్గాలు రాజకీయ ఉచ్చులో పడ్డాయి. పార్టీలన్నీ ఇప్పుడు సామాజిక వర్గాల చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. మరో రెండు రోజుల్లో పోలింగ్ ఉండగా, ఆ వర్గాలను ఎలాగైనా ప్రభావితం చేయాలన్న లక్ష్యంతో పార్టీలన్నీ అన్ని బలాలను ఉపయోగిస్తున్నాయి. అధికార, ప్రతిపక్షానికి ఏ సామాజిక వర్గం దూరంగా ఉందో ఆ వర్గాలను ప్రసన్నం చేసుకోవడానికి అన్ని స్థాయిల్లోనూ వ్యూహాలు రూపొందించారు. నియోజకవర్గంలో ఎన్నోసార్లు పోటీలో ఉన్న రెండు సామాజిక వర్గాల ప్రతినిధులే ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఆ తర్వాత వారి వారసత్వం, బంధువర్గం ఇలా రాజకీయ ప్రాతినిధ్యం వహిస్తోంది. దీంతో మిగిలిన కీలకమైన సామాజిక వర్గాలు కాస్త గుర్రుగా ఉండటంతో అధికార, ప్రతిపక్షాలు ఆ వర్గాలపై దృష్టి సారించాయి. గతంలో ఏ ఎన్నికొచ్చినా మహిళలు, యువత ఓట్లపైనే గురిపెట్టి వారి ఓట్లు పొందేందుకు అవసరమైన అంశాలను ఆలోచించేవారు. కానీ నంద్యాల ఉప ఎన్నిక ఇందుకు భిన్నంగా సామాజిక వర్గాల నేపథ్యంలో సాగుతోంది. అధిక శాతం ఓట్లున్న సామాజిక వర్గాలను ప్రసన్నం చేసుకోవడంతోపాటు వారడిగిన పదవులను కొందరికి ఇప్పటికే అధికార పార్టీ కట్టిబెట్టి కొంత మేరకు ఫలితాలు సాధించింది. దీంతో ఆ ఓట్లకు గండి కొట్టేందుకు ప్రతిపక్ష పార్టీ సామాజిక వర్గంలో రెండో వర్గాన్ని బయటకు తెచ్చింది. తమ సామాజిక వర్గాల బలాబలాలను బట్టి రెండు పార్టీలు గతంలో ఆత్మీయ సమావేశాలను ఏర్పాటు చేసినా తిరిగి గత రెండు రోజులుగా మద్దతు సమావేశాలను నిర్వహించాయి. దాదాపుగా నియోజకవర్గంలో కీలకమైన అన్ని సామాజిక వర్గాల సమావేశాలు రెండు పార్టీలు నిర్వహించాయంటే సామాజిక వర్గాల వారీగా ఓట్లను పొందేందుకు పార్టీలు ఎంతగా శ్రమిస్తున్నాయో నంద్యాల ఉప ఎన్నికే నిదర్శనం. విస్మరించిన కొన్ని సామాజిక వర్గాలకు గుర్తింపు లభించిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. అలిగిన సామాజికవర్గ నేతలను బుజ్జగించి ఏదో ఒక ఆశతో తమ వైపు తిప్పుకొనే ప్రయత్నంలో ఇరుపార్టీలు కాస్త ఫలితం సాధించినట్లే భావించొచ్చు.

మద్దతు మాకే కదా..!



జూలెపల్లెలో మహిళలకు అభివాదం చేస్తున్న జూపూడి ప్రభాకర్‌రావు



ప్రచారంలో పాల్గొన్న పట్టణానికి చెందిన హిజ్రాలు




చంద్రబాబుకు జ్ఞాపికను బహూకరిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ఆకర్షా.. ఆకర్షా...

- తెదేపా నుంచి యువ ఓటర్లను ఆకర్షించడానికి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డితోపాటు దివంగత భూమా దంపతుల కుమార్తెలు అఖిలప్రియ, మౌనిక, కుమారుడు జగత్ విఖ్యాత్‌రెడ్డితోపాటు తెదేపా అభ్యర్థి సతీమణి ప్రతిభారెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వీరికి తోడుగా ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తెలు సుజల, రాణిలతోపాటు అల్లుళ్లు శ్రీధర్ రెడ్డి, సురేశ్‌లు ప్రచారం చేస్తున్నారు.
- వైకాపా యువత ఓట్లపై గురి పెట్టి అభ్యర్థి రవిచంద్రకిశోర్‌రెడ్డితోపాటు కుమారుడు శిల్పా నాగినిరెడ్డి, కూతురు శిల్పా కోడలు రంగంలో దిగారు. వీరికి తోడు శిల్పా చక్రపాణిరెడ్డి కుమారుడు, శిల్పా మోహన్‌రెడ్డి అల్లుడు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

ఈ విధంగా ముందుకు పోదాం



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఇలా ఓటేయాలి మరి



ఈవీఎం ద్వారా ఓటు వేయడంపై అధికారుల అవగాహన

ప్రస్తుతం నంద్యాల ఉప ఎన్నికల ప్రచారం ఇక ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉంది. దాంతో అభ్యర్థులు ప్రతి ఇంటిని చుట్టేస్తున్నారు. చివరకు వారి ప్రచార సరళి ఏ విధంగా ఉందో తెలిపే వ్యంగ్య చిత్రమిది.

- న్యూస్‌టుడే, గోనెగండ్ల



అమ్ముడుపోరంటే.. ఆదరణ దక్కేనా



రాపస నాయకుల వినూత్న ప్రచారం

కుర్చీల కోసమే పోరాటం



ముఖ్యమంత్రి సమావేశంలో వర్షం రావడంతో కుర్చీలు పట్టుకున్న కార్యకర్తలు

దూకుడు పనికి రాదు



జగన్ ప్రచారంలో వాహనం పైనుంచి దూకుతున్న యువకుడు

సైకిల్ వాలా జిందాబాద్



పచ్చని దుస్తులతో ప్రచారానికి వస్తున్న తెదేపా కార్యకర్త

ప్రార్థనలు ఫలించేనా



చర్చిలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి

'కృష్ణ'.. తీర్చునా ఓట్ల తృష్ణ



ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



చిత్రంలో ఉన్నది ఎమ్మిగనూరు బాలురు జూనియర్ కళాశాల విద్యార్థులు.. బోధిస్తున్నది రసాయనశాస్త్ర ఒప్పంద అధ్యాపకుడు ప్రేమ్‌కుమార్. కళాశాలలో మొత్తం 800 మంది విద్యార్థులు ఉండగా 25 మంది అధ్యాపకులు బోధిస్తున్నారు. ఇందులో ఐదుగురు రెగ్యులర్, ఆరుగురు వృత్తివిద్య అధ్యాపకులు ఉండగా 14 మంది ఒప్పంద అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. కళాశాలలో రసాయనశాస్త్రం, గణితం, భౌతికశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, వృత్తివిద్య ఇలా కీలకమైన సబ్జెక్టులను ఒప్పంద అధ్యాపకులే బోధిస్తున్నారు. కళాశాల మొత్తం వీరి సేవలపైనే ఆధారపడి నడుస్తోంది. వీరి వేతనాలు నెలనెలా ఇవ్వకపోవడం తోడు రెన్యువల్ చేయకుండా ఉన్నతాధికారులు తాత్సారం చేస్తున్నారు.

బోధన.. వేదన



ఉద్యోగ భద్రత కోసం నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు (దాచిన చిత్రం)

- ☛ ప్రభుత్వ కళాశాలల్లో ముందుకెళ్లని పాఠాలు
- ☛ ఆందోళనలో ఒప్పంద అధ్యాపకులు
- ☛ నేటికీ అందని రెన్యువల్ ఉత్తర్వు
- ☛ వేతన ఇబ్బందులు సరేసరి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థి దశలో కీలకమైంది ఇంటర్మీడియట్ విద్య. ఉత్తమ ఫలితాల సాధనతో ప్రభుత్వ కళాశాలలు కార్పొరేట్ పోటీని తట్టుకొని నిలబడగలుగుతున్నాయి. శాశ్వత బోధకుల నియామకంలో నెలకొన్న జాప్యం విద్యార్థుల చదువులపై పడుతోంది. బోధనలో ఒప్పంద అధ్యాపకులు కీలకంగా వ్యవహరిస్తుండగా ఏటా మాదిరిగానే ఈ విద్యాసంవత్సరం వారి సేవలు కొనసాగేలా నేటికీ ఉత్తర్వులు ఇవ్వలేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తుండగా.. ఇటు రెన్యువల్ ఉత్తర్వులు అందక అటు జీతాలు రాక బాధిత అధ్యాపకులు ఆందోళనలో ఉన్నారు. ప్రైవేటు కళాశాలలు మేలోనే తరగతులు ప్రారంభించి సెప్టెంబరులోగా సిలబస్ పూర్తి చేస్తున్నాయి. అనంతరం పునఃశ్చరణ తరగతులు, మాదిరి పరీక్షలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతిభకు మరింత సాన బెడుతున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం పొందిన పేద విద్యార్థులు మాత్రం ఆగస్టు పూర్తవుతున్నా.... తమకు పూర్తిస్థాయిలో అధ్యాపకులేరీ అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

☛ జిల్లా వ్యాప్తంగా 42 ప్రభుత్వ, నాలుగు వృత్తివిద్య జూనియర్ కళాశాలలు ఉండగా 6,500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీటిలో శాశ్వత ప్రాతిపదికన 190 మంది, ఒప్పంద పద్ధతిన 306 మంది అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. ఒప్పంద అధ్యాపకుల్లో తెలుగు 30, ఆంగ్లం 29, వృక్షశాస్త్రం 16, జంతుశాస్త్రం 20, భౌతికశాస్త్రం 22, రసాయన శాస్త్రం 25, చరిత్ర 17, అర్థశాస్త్రం 15, పౌరశాస్త్రం 25, వాణిజ్యశాస్త్రం 24, గణితం 15, హిందీ 4, సంస్కృతం 3, కన్నడ 3, వృత్తివిద్య కోర్సులు 56 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

మానసిక వేదనతో విధులు

2017 జూన్ 1న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ వరకు వీరి సేవలను వినియోగించుకొన్న ప్రభుత్వం గత విద్యా సంవత్సరం సంబంధించి కొంత వేతనాలను ఇప్పటివరకు విడుదల చేయలేదు. ప్రత్యామ్నాయ ఆదాయం, ఉపాధి లేని కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అందినంత అప్పులు చేయాల్సి వస్తోంది. రెండు నెలల వేతనాలు జమ చేయాల్సి ఉందని బాధితులు వాపోతున్నారు. గతేడాది వరకూ నెలకు రూ.18,000 వేతనం చెల్లించగా అదీ మూడునెలలకోసారి ఇస్తుండటంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలన్న ప్రశ్న వస్తోంది. మహిళా అధ్యాపకులకు కనీసం ప్రసూతి సెలవులు ఇవ్వడం లేదు.

వీరే సేవలే ఆధారం

స్థానిక ప్రిన్సిపళ్ల చొరవతో ఒప్పంద అధ్యాపకులు ఈ విద్యా సంవత్సరంలో రెండు నెలలుగా విధులకు హాజరై పాఠాలు బోధిస్తున్నారు. రెన్యువల్ ఉత్తర్వులు రాకపోవడంతో కొందరు ప్రైవేటు కళాశాలల్లో అతిథి తరగతులు బోధించడం ఇతరత్రా వ్యాపకాల్లో ఉంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. నిర్ణయాల్లో జాప్యంతో వారి భవిత అగమ్యగోచరంగా మారింది.

సమస్యలు ఇలా..

- గతేడాది పనిచేసిన ఒప్పంద అధ్యాపకులకు ఈ ఏడాది కళాశాలలు ప్రారంభమైన మొదటి వారంలోనే రెన్యువల్ ఉత్తర్వులు అందాల్సి ఉండగా ఇప్పటివరకు చేయలేదు.
- సమాన పనికి సమాన వేతనం అందించాలన్న ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు 2017 ఏప్రిల్ 18న ఒప్పంద అధ్యాపకులకు 50 శాతం వేతనాలు పెంచుతామని రాష్ట్ర మంత్రివర్గ ఉపకమిటీ ప్రకటన జారీ చేసినా అమలు చేయలేదు.
- తెలంగాణ రాష్ట్రంలో ఒప్పంద అధ్యాపకులకు ప్రభుత్వం రూ.37వేలు వేతనం చెలిస్తూ.. ఇతర ప్రయోజనాలు కల్పిస్తుండగా ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదంటూ ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వ కళాశాలకు ఏటా ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేది. ఈ ఏడాది ముద్రణ సమస్యతో సరఫరా ఆగిపోయింది.

అధికారుల సమన్వయ లోపం

– ఎన్.బ్రహ్మేశ్వర్లు, ఒప్పంద అధ్యాపకుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి



ప్రతి ఏడాది మాదిరిగానే ఈ విద్యాసంవత్సరం ఒప్పంద అధ్యాపకులను రెన్యువల్ చేయాలని నివేదిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. వాస్తవానికి కళాశాల పునఃప్రారంభమైన మొదటి వారంలోనే ఈ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. కమిషనర్, సెక్రటరీ కార్యాలయం అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఏటా ఇబ్బందులు పడుతున్నాం. అమరావతి చుట్టూ ఐదుసార్లు తిరిగినా ఫలితం లేదు.

త్వరగా ఉత్తర్వులు ఇవ్వాలి

– డీకే ఈశ్వర్, ఒప్పంద అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



కళాశాలల పునఃప్రారంభం సమయంలోనే రెన్యువల్ ఉత్తర్వులు ఇస్తే ఇబ్బందులు ఉండవు. నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వడం లేదు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? వేతనాల పెంపునకు సంబంధించి నివేదికను అమలుపర్చాల్సి ఉంది. ఉన్నత న్యాయస్థానం తీర్పును ప్రభుత్వం అమలు చేస్తే న్యాయం జరుగుతుంది. అనేక సమస్యలతో బోధనపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.



మమ అనిపించారు

జిల్లావ్యాప్తంగా సాక్షరభారత్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో తూతూమంత్రంగా జరిగాయి. పర్యవేక్షణ కరవవడంతో అధికారులు మమ అనిపించేశారు. హాలహర్విలో జరిగిన పరీక్షలో తల్లులు తమ పిల్లలతో వచ్చి పరీక్షలకు హాజరయ్యారు. **- న్యూస్‌టుడే, హాలహర్వి**

22న బ్యాంకుల సమ్మె

కర్నూలు జిల్లాపరిషత్, న్యూస్‌టుడే: బ్యాంకుల ప్రైవేటీకరణ, ప్రజావ్యతిరేక బ్యాంకింగ్ సంస్కరణలను నిరసిస్తూ ఈనెల 22న బ్యాంకుల సమ్మె చేపడుతున్నట్లు యూఎఫ్‌బీయూ జోనల్ కార్యదర్శి శివకుమార్, జోనల్ ఉప కార్యదర్శి మౌలాలి, జోనల్ సహాయ కార్యదర్శి ఎల్లయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు బ్యాంక్ ఉద్యోగులు ఆంధ్రబ్యాంక్ జోనల్ కార్యాలయానికి చేరుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

భర్త చేతిలో భార్య హతం

జక్కసానికుంట్ల (ప్యాపిలి), న్యూస్‌టుడే : భార్య ప్రవర్తనపై అనుమానంతో భర్త ఆమెఉ రోకలిబండతో తలపై బాది చంపిన ఘటన ప్యాపిలి మండలం జక్కసానికుంట్ల గ్రామంలో ఆదివారం జరిగింద. గ్రామస్థుల కథనం మేరకు జక్కసానికుంట్ల గ్రామం దళితవాడకు చెందిన పుల్లన్న గత కొన్ని సంవత్సరాలుగా కుటుంబంతో సహా డోన్‌లో కాపురం ఉంటూ చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భార్య ప్రవర్తనపై అనుమానంతో పుల్లన్న ఆదివారం భార్య చిన్న నాగులు (38)ను స్వగ్రామం జక్కసానికుంట్లకు తీసుకెళ్లి ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోకలిబండతో తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి ఒక కుమార్తె ఉన్నారు. ప్యాపిలి ఎస్.ఐ తిమ్మయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో బీహార్ కూలీ మృతి



మృతిచెందిన నాగేంద్ర ప్రసాద్

కర్నూలు నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్నూలు మండలం వెంగన్నబావి వద్ద ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతంతో నాగేంద్ర ప్రసాద్ (49) అనే వ్యక్తి మృతిచెందారు. బీహార్ రాష్ట్రం చాప్రసారం జిల్లా ఆర్వా గ్రామానికి చెందిన ఇతడికి భార్య సుశీలదేవి, ముగ్గురు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. కుమారుడు రోహిత్ కుమార్, మరో ఏడుగురుతో కలిసి కర్నూలు నగరంలో సిల్వర్‌జుబ్లీ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న ఉపరితల వంతెన నిర్మాణానికి సంబంధించిన కంకర తయారీ పనిచేసేందుకు ఇతను వచ్చారు. వెంగన్నబావి సమీపంలో గుడిసెలో నివాసం ఉండేవారు. వంట చేసుకొనేందుకు ఎండిన చెట్టుకొమ్మలను ఇనుప తీగతో విరగగొట్టే క్రమంలో తీగ చెట్టుపైనున్న విద్యుత్ తీగలపై పడటంతో విద్యుదాఘాతం సంభవించి ఇతని వీపుభాగం మొత్తం కాలిపోయింది. వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలో మృతిచెందారు. ఘటనపై స్పష్టత రావలసి ఉంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్వరరెడ్డి తెలిపారు.

మల్లన్నకు లక్ష బిల్వార్చన పూజలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో మల్లికార్జునస్వామికి ఆదివారం మాసశివరాత్రి మహోత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు విశేష పూజలు జరిపారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చనలు నిర్వహించారు. సాయంకాలం 11 మంది ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు జరిపారు.

అనాథ, అంధ విద్యార్థులకు సాయం

కర్నూలు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ మురళీధర్ తన కుమార్తె అక్షిత ఏడో వర్ధంతిని పురస్కరించుకొని కర్నూలు సమీపంలోని అక్షిత భవనంలోని అమ్మ అంధుల పాఠశాలలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఆళ్లగడ్డకు చెందిన ముగ్గురు అనాథ విద్యార్థులకు అక్షిత ట్రస్టు తరఫున ఆర్‌డీఓ హుస్సేన్ సాహెబ్ చేతుల మీదుగా రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అక్షిత ట్రస్టు అధ్యక్షురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఆర్‌డీఓ, డీఎస్పీలు

పీఆర్సీ బకాయిలకి కృషి

మహానంది, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ఒప్పంద ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి రావాల్సిన పదవ పీఆర్సీ బకాయిలు రూ.5,400 కోట్లను రాబట్టడానికి కృషిచేస్తున్నామని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మహానంది పుణ్యక్షేత్రానికి దైవదర్శనానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాటాడుతూ నంద్యాలలోని ఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించామన్నారు. ఇక్కడ చర్చించిన సమస్యలను ఈ నెల 30వ తేదీన విజయవాడలో నిర్వహించే సమావేశంలో మరోసారి చర్చిస్తామన్నారు.

మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత పించన్ సౌకర్యం లేదని, దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ సదుపాయం కల్పించాలని ఆలయ పర్యవేక్షకులు ఓ. వెంకటేశ్వర్లు, నంద్యాల ఏపీ ఎన్జీవోస్ కార్యదర్శి బీసీ హుస్సేన్‌రెడ్డిలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఎన్నికల తర్వాత నివేదిక తీసుకొని వస్తే ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. ఆయనకు దేవస్థానం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. రాష్ట్ర, జిల్లా కార్యవర్గ నాయకులు రామకృష్ణారెడ్డి, గంగిరెడ్డి, చంద్రశేఖర్, దస్తగిరిరెడ్డి, హుస్సేన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



మహానందిలో అశోక్‌బాబుకు ప్రసాదం అందజేస్తు న్న దేవస్థానం అర్చకులు, అధికారులు

మహానందికి బొప్పరాజు రాక

మహానందిలోని ఆర్యవైశ్య సత్రంలో ఆదివారం జరిగిన ఓ సమావేశంలో రాష్ట్ర ఏపీ జేఏసీ చీలిక వర్గం ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ ఫణి పేర్రాజులు పాల్గొన్నారు. వీరు రెవెన్యూ విభాగానికి చెందిన సిబ్బందితో సమావేశమయ్యారు.

చెరువులు.. ఓటి కుండలు

- ★ పదేళ్లుగా ఆయకట్టు భూములు బీడు
- ★ హంద్రీనీవా నీటిపై పైనే రైతుల ఆశలు
- ★ చెరువులు నింపే ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితం
- ★ 10 వేల కుటుంబాలకు తప్పని ఎదురు చూపులు

చెరువుల కింద పంటలు సాగు చేసే రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దాదాపు పదేళ్లుగా వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు నిండ లేదు. భూగర్భజలాలు పడిపోయాయి. రైతులు పంటలకు దూరమయ్యారు. సాగు,తాగునీటికి కర్షకులు పడుతున్న తిప్పలు అన్నీ ఇన్నీ కావు. ఒకప్పుడు చెరువు నీటితో ఏడాదికి రెండు పంటలు వేసే చోట ఇప్పుడు బీడు పెట్టుకోవాల్సి వచ్చింది. చెరువులు చుక్క నీరు లేక ముళ్ల కంపలతో దర్శనమిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఆయకట్టు రైతుల పరిస్థితిపై పరిశీలన కథనం.

-న్యూస్‌టుడే, డోన్



ఈ చిత్రంలో అంతా కంప చెట్లు కనిపిస్తున్నాయని అనుకుంటున్నారా? ఐదేళ్ల కిందట డోన్ మండలం ఉడుములపాడు చెరువు కింద వరిపంట పండిన పొలం ఇది. ఐదేళ్లుగా సరైన వర్షాలు లేక చెరువు నిండలేదు. పొలంలో పంటలు వేయలేదు. దీంతో వరి పంటలు పండే పొలం కంపచెట్లతో దట్టమైన చిట్టడివిలా మారింది. ఉడుములపాడు గ్రామంలో రామలక్ష్మమ్మకు చెందిన ఈ నాలుగెకరాల పొలాన్ని తలారి భాస్కర్ అనే వ్యక్తి కౌలుకు సాగు చేస్తున్నారు. ఐదేళ్లుగా నీళ్లు లేక పంటలు వేయకపోవడంతో ఇలా కంపచెట్లు పెరిగాయి.



ఇక్కడ కనిపిస్తున్న ఎండిపోయిన చెరువు జిల్లాలోనే అతిపెద్ద చెరువుల్లో ఒకటైన అబ్బిరెడ్డిపల్లె తటాకం. దీని కింద అధికారికంగా 1750 ఎకరాలు సాగు అవుతుంది. చెరువులో నీరు బాగా ఉంటే అనధికారికంగా మరో వెయ్యి ఎకరాలు సాగు అవుతుంది. ఈ చెరువు కింద దాదాపు 1500 కుటుంబాల రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. నాలుగేళ్లుగా వర్షాలు లేక చెరువు నిండలేదు. పంటలు పండలేదు. ఇటీవలే వందేళ్లు పూర్తి చేసుకున్న ఈ చెరువు నీరు లేక ఒట్టిపోయింది. ఈమధ్య పడిన ఒకటి రెండు వర్షాలకు కొద్ది మేర నీరు చేరింది. అయినా పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు అంటున్నారు.



ఈ చిత్రంలో కంప చెట్లతో నిండి కనిపిస్తున్న చెరువు ప్యాపిలి మండలం వెంగళాంపల్లె చెరువు. ఈ చెరువు కింద 150 ఎకరాల పొలం సాగవుతోంది. అయితే గత పదేళ్లుగా నీళ్లు లేక పంటలు వేయకపోవడంతో ఏపుగా కంపచెట్లు పెరిగాయి. ఈ చెరువు కింద దాదాపు 100 కుటంబాల రైతులు ఆధారపడి జీవిస్తున్నారు.

డోన్ నియోజకవర్గ పరిధిలో చెరువుల కింద సాగు చేస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏ చెరువు కింధా ఐదేళ్లుగా ఒక ఎకరా పొలం కూడా సాగునకు నోచుకోలేదు. చెరువులు సైతం నీరు లేక కంపచెట్లతో నిండిపోయాయి. వర్షాభావంతో బయలు పొలాల రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మూడేళ్లుగా వేసిన పంటలు పండక నష్టపోయి ప్రభుత్వ పరిహారం కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ సమీపంలో పత్తికొండ నియోజకవర్గం కృష్ణగిరి సమీపంలో హంద్రీనీవా కాల్వలో నీళ్లు పోతున్నాయి. ఆ నీళ్లతో చెరువులు నింపుకొంటే రైతుల కష్టాలు తీరుతాయని ఎదురుచూస్తున్నారు. హంద్రీనీవా నీటితో చెరువుల నింపే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే అవి ఇంకా ప్రతిపాదనలుగానే ఉన్నాయి.

ప్రతిపాదనలతో సరి

జిల్లాలో వంద చెరువులను హంద్రీనీవా నీటితో నింపేందుకు జలవనరులశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపి ఆరునెలలు దాటినా పనులు మంజూరు కాలేదు. జిల్లాలో చెరువులను హంద్రీనీవా నీటితో నింపితే దాదాపు 20 వేల ఎకరాలు సాగులోకి వస్తాయి. వీటితో పాటు వంద గ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుంది. ఆయా గ్రామాల్లో 1.5 లక్షల జనాభాకు తాగునీరు అందుతుంది. ఇలాంటి మంచి కార్యక్రమంపై ఉదాసీనత ప్రదర్శించడం తగదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

★ ఈ ప్రాజెక్ట్ వల్ల జిల్లాలోని డోన్, పత్తికొండ నియోజకవర్గాలు అధికంగా, నందికొట్కూరు, పాణ్యం, కర్నూలు, ఆలూరు నియోజకవర్గాలలోని కొన్ని మండలాల రైతులు, ప్రజలు లబ్ధి పొందుతారు. దీంతో ఈ పనులు మంజూరు కావడానికి ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రత్యేక చొరవతీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కంచెట్లతో నిండిపోయిన ఉడుములపాడు చెరువు

పంటలు లేవు - రమేష్, రైతు, లక్ష్మంపల్లె



అబ్బిరెడ్డిపల్లె చెరువు కింద 0.75 ఎకరాల పొలం ఉంది. గతంలో బాగా నీళ్లు ఉన్నప్పుడు ఏడాదిలో రెండు సార్లు వరి పంట పండించాం. నాలుగేళ్లుగా నీళ్లు లేక పంట పండలేదు. పొలం బీడు వారింది. 2013 నుంచి పంటలు వేయలేదు. పొలం బీడుగానే ఉంది. చెరువుకు హంద్రీనీరు ఇస్తే తాము పంటలు పండించుకొని కుటంబాలను పోషించుకుంటాం.

హంద్రీనీటితో నింపాలి - వీరాంజనేయులు, ఉడుములపాడు



ఉడుములపాడు చెరువు కింద పొలం ఉంది. ఐదేళ్లుగా వర్షాలు లేక పంటలు లేవు. చెరువును హంద్రీనీటితో నింపితే రైతులకు మేలు జరుగుతుంది. తమ చెరువు కింద అధికారికంగా వంద ఎకరాలు సాగు చేస్తారు. అనధికారికంగా మరో 50 ఎకరాలు సాగవుతుంది. చెరువు కింద వంద కుటుంబాలు వారు ఉన్నారు. చెరువును హంద్రీ నీటితో నింపితే రైతులతో పాటు గ్రామంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్య తీరుతుంది.

ఆధ్యాత్మిక తీరంలో అద్భుతం

- ★ హనుమాన్ సంకీర్తనలతో శ్రీమఠం 9 రికార్డులు
- ★ ఏకధాటిగా 6గంటలు ఆలపించిన 2500 మంది మహిళలు
- ★ పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అభినందనలు



జ్యోతి వెలిగిస్తున్న పీఠాధిపతి



పాల్గొన్న ఆయా రికార్డ్స్ సంస్థల ప్రతినిధులు



కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఆధ్యాత్మిక ప్రచారంలో భాగంగా 2500 మంది భజన మండళ్ల మహిళలతో 108 హనుమాన్ సంకీర్తనలు(కన్నడలో) ఆరు గంటల పాటు ఏకధాటి ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీమఠం తొమ్మిది ప్రపంచ రికార్డులు సొంతం చేసుకున్నట్లు న్యాయ నిర్ణేత టీవీ సుబ్బారావు ఆదివారం సాయంత్రం ప్రకటించారు. ఈ మొత్తం కార్యక్రమం రాఘవేంద్రస్వామి మఠం వారి గురుసార్వభౌమ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగింది. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో యేగీంద్ర సభావేధికపై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాజెక్టు డైరెక్టర్ అప్పణ్ణచార్, సహాయ డైరెక్టర్ నారాయణ దాసు అధ్యక్షతన సాయంత్రం ఆరు గంటల వరకు సాగింది. దిల్లీ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మహిళలు తరలివచ్చారు. ఇందుకు ప్రత్యేక పరిశీలకులుగా రికార్డులకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. సాయంత్రం కార్యక్రమం ముగిసిన అనంతరం న్యాయనిర్ణేతలు తొమ్మిది ప్రపంచ రికార్డులు సృష్టించినట్లు ప్రకటించారు. పీఠాధిపతికి రికార్డులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మాట్లాడుతూ ఆనందం వ్యక్తం చేశారు. మన సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పంతో దీన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. గతంలో విదేశాల్లో ఇలాంటి రికార్డులు స్థాపించారనీ... ఇప్పుడు మన తెలుగు రాష్ట్రంలో రికార్డులు సృష్టించడం గర్వకారణమని రికార్డుల సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

సాధించిన రికార్డులు

1. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, 2. ఇండియన్ టాలెంట్ ఆర్గనైజర్ రికార్డ్స్, 3. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 4. వరల్డ్ రికార్డ్స్ ఇండియా, 5. మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్, 6. గోల్డెన్ స్టార్ రికార్డ్స్, 7. జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 8. హై రేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, 9. మార్వలెస్ రికార్డ్స్ సాధించారు. వీటికి సంబంధించిన ప్రతినిధులు రికార్డులు, ప్రశంసా పత్రాలను పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులుకు అందజేశారు. కార్యక్రమంలో రికార్డ్స్ సంస్థల ప్రతి



పీఠాధిపతికి అవార్డులను అందిస్తున్న ప్రతినిధులు

నిధులు చింతలపట్ల వెంకటాచారి(తెలుగు బుక్ఆఫ్ రికార్డ్ వ్యవస్థాపకులు, ఛైర్మన్), డాక్టర్ సాయిశ్రీ (రికార్డ్స్ పరిశీలకులు), డాక్టర్ బాలమురళి, కిషోర్ (గిన్నిస్ రికార్డ్స్ ప్రొఫెసర్లు) డాక్టర్ బారిక చంద్రశేఖర్, బ్రహ్మానంద ఆచార్య(కర్నూలు కో-ఆర్డినేటర్స్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్) డాక్టర్ సంఘిశెట్టి సత్యనారాయణ(ఇండియన్ టాలెంట్స్)లతోపాటు శ్రీమఠం అధికారులు మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, ధార్మిక అధికారి శ్రీపతి, సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, విద్యాపీఠం ప్రిన్సిపల్ ఎన్.వాదీరాజచార్, సీఐ డి.రాము, ఎస్ఐ శ్రీనివాసనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు 'పాలు'



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పాల ప్యాకెట్లు అధికారుల నిరక్ష్యంతో రహదారి పాలవుతోంది. వీటిని సకాలంలో అందించకపోవడంతో పాలు పనికిరాకుండా పోతున్నాయి. ఆస్పరి సమీపంలో ఆదోని రహదారి ప్రాంతంలో ఇలా పెద్దసంఖ్యలో పాల ప్యాకెట్లను నేలపాలు చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి సకాలంలో వీటిని అందజేసి వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, ఆస్పరి**



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాంకేతిక పరిజ్ఞానానికి ఆద్యుడు రాజీవ్

కర్నూలు జిల్లాపరిషత్: జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన దేశంలో సాంకేతిక పరిజ్ఞానానికి ఆద్యుడుగా నిలిచారని కొనియాడారు. పార్టీ నగర అధ్యక్షులు సర్దార్‌బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ వెంకటస్వామి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు తిప్పన్న, పెద్దారెడి పాల్గొన్నారు.



TENTH English

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

ప్రతిభ

Nithin is fond *of* eating..

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company the keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.

2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
   a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
   a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
   a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
   a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
   1) 60 2) 50 3) 48 4) 24
2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
   1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం
3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
   1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ
4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
   1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
   3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.
5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
   1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
   3) శుద్ధ ప్రేరక వలయం
   4) శుద్ధ కెపాసిటర్ వలయం
6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
   1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
   3) విద్యుత్ వాహకం 4) అతివాహకం
7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
   1) పీడనం 2) ఆర్ద్రత
   3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత
8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
   కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
   1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
   2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
   3) A, R రెండూ సరైనవి కావు.
   4) A సరైంది. కానీ, R సరైంది కాదు.
9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
   1) లెంజ్ నియమం
   2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
   3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ
10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
    2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
    3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
    4) పైవన్నీ సరైనవే
11. కేంద్రక బలాలు....
    1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
    3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ
12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
    1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
    2) శక్తి నిత్యత్వ నియమం
    3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ
13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
    1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
    3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్
14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
    1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
    2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

    3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
    4) 1, 3
15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
    1) అర్ధ వృత్తం 2) వృత్తం
    3) పరావలయం 4) ఏదీకాదు
16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
    1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C
17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
    1) కుంభాకార, 100 సెం.మీ.
    2) పుటాకార, 10 సెం.మీ.
    3) కుంభాకార, 50 సెం.మీ.
    4) పుటాకార, 50 సెం.మీ.
18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
    1) λ, υ రెండూ పెరుగుతాయి
    2) λ పెరుగుతుంది, υ స్థిరం
    3) λ తగ్గుతుంది, υ స్థిరం
    4) λ, υ రెండూ తగ్గుతాయి
19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
    1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
    3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం
20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
    1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
    2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
    3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
    4) వడి, చలన దిశ రెండూ స్థిరం
21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్‌జ్‌లలో)
    1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25
22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
    1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$
23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
    1) ధ్రువణం 2) వ్యతికరణం
    3) పరిక్షేపణం 4) విక్షేపణం
24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
    1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
    2) సంకేత తరంగ తక్షణ దశ
    3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
    4) సంకేత తరంగ తక్షణ వేగం
25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
    1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
    2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
    3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
    4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లి సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ ఛోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ. 4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరోవిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్ల కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యా బాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఒడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఒడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకాగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన ఛత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని ఆయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిష్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు



ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!


- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద

సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి


1. Summer	వే □ □	5. Pay	వే □ □
2. Flute	వే □ □	6. God	వే □ □
3. Speed	వే □ □	7. Function	వే □ □
4. Heat	వే □ □	8. Dawn	వే □ □

- డీ దయామతి, హన్మకొండ



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!

హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.



చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముూ! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: **ఏది భిన్నం:** a **చిలిపిప్రశ్న:** తినలేం కాబట్టి! **సరదా పదాలు:** 1.వేసవి 2.వేణువు 3.వేగము 4.వేడిమి 5.వేతనం 6.వేలుపు 7.వేడుక 8. వేకువ



ప్రతిభావంతులతో టీజీ వెంకటేష్ తదితరులు

ఆవోపా ప్రతిభా పురస్కారాల ప్రదానం

కర్నూలు జిల్లాపరిషత్, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం వీఆర్‌కాలనీలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు 17వ విడత ఆర్థిక సహకార పంపిణీ కార్యక్రమం జరిగింది. రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాలు ప్రదానం చేసి విద్యార్థులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్నిరంగాల్లో ఉన్నతంగా రాణించాలని, ఉన్నతస్థాయిలో స్థిరపడ్డాక సమాజసేవలో పాలు పంచుకోవాలని సూచించారు. సుమారు రూ.8 లక్షల విలువ చేసే పురస్కారాలను విద్యార్థులకు అందజేశారు. సంఘం నగర అధ్యక్షులు జవహర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సత్యనారాయణ, కేవీ ప్రసాద్, నాగేశ్వరరావు, రత్నప్రసాద్, లక్ష్మీనారాయణ, యుగంధర్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ శమంతకమణి, ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్

01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్

01:15 ది బ్రేకప్ కన్సల్టంట్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్

03:30 హంగామా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 ఈ-జంక్షన్

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)

డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ.3:30, సా.7:30)

యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)

గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.5:00, రా.10:30)

అమృతం (ఉ.8:00, మ.12:30, రా.8:00)

హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా.8:30)

ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ.03:00, సా.4:00, రా.9:00)

ఆయుష్ (ఉ.9:30)

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ.10:00)

అందరికి ఆరోగ్యం (ఉ.10:30)

విహారి (మ.12:00, సా.6:30, రా.10:00)

హెల్దీ డయాబెటిక్ - (మ.1:30)

జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ.2:00, రా.7:00)

బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ.2:30, రా.9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో** – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, **ఉ.9:30: వావ్ ఏమి రుచి** – అఖిడీ టుకో అష్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, **ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు** – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, **ఉ.11.00: గోరు ముద్దలు** – ఆఫ్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ** – ఫ్రూటీ ఓట్స్, **ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్** - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** - సార్షో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్** – ఓట్స్ మసాల పూరీ, **మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - ఫీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, **మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్** - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి** – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ **(జపాన్ క్యూసైన్)**, **మ.1.30, రా.10.00: చటపట (అత్తమ్మ రుచుల స్పెషల్)** - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, **మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్** – చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, **మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్** – బీన్స్ ఉసిలి, **మ.2.30, సా.6.00: చోటా షెఫ్** – సాబూదాన చుడ్వా, **మ.2.45, రా.10.45: జిల్** – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, **మ.3.00: ఛాయ్ బిస్కెట్** – కాల్ జోన్స్ & ఛాక్లెట్ ఆల్మాండ్ కాఫీ, **మ.3.15: సూప్స్ & స్టార్టర్స్** - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC: **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి.సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: **రాక్షసుడు.**

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: **రాజాబాబు,** **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: **రైడ్,** **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: **కితకితలు.**

HBO: ఉదయం: 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

ETV అన్నదాతలో... రేపు ఉదయం 6.30 గం.లకు

1. పత్తిలో గులాబీరంగు పురుగు - సమగ్ర నివారణ
2. దక్షిణ మండలంలో సాగు చేసుకోదగ్గ ప్రత్యామ్నాయ పంటలు
3. డ్రమ్‌సీడర్ యంత్రంతో వరి నాట్లు, కలుపు నివారణ పద్ధతులు

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు

రైతేరాజు

ETV ఆంధ్ర ప్రదేశ్ జైకిసాన్‌లో... నేటి సాయంత్రం 6.30 గంటలకు

1. ప్రకాశం పశ్చిమ ప్రాంతంలో వర్షాలు- నిండిన చెక్‌డ్యాములు
2. కొబ్బరికి గిరాకీ- ఊరట పొందుతున్న గోదావరి జిల్లాల రైతులు

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

యాంత్రీకరణ తోనే గిట్టుబాటు సాగు

పనులకు వినియోగించే పశుసంపద తరిగిపోవడం, కూలీల కొరత ఏర్పడటంతో వ్యవసాయం పెనుభారంగా మారింది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని యంత్రాలతో చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. యంత్రాలు రైతుల శ్రమను, సాగు ఖర్చును 30 నుంచి 60 శాతం వరకు తగ్గించే అవకాశాలున్నాయి. కనుక వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే యాంత్రీకరణ అవసరమని చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు భాస్కరయ్య అన్నారు.

యంత్ర పరికరాలు: నేల దున్నటానికి కల్టివేటరు, రోటోవేటరు, విత్తనం వేయడానికి సీడ్‌డ్రిల్లర్, ప్లాంటర్, అంతరకృషి కోసం పవర్‌వీడర్, సస్యరక్షణ కోసం చిన్న స్ప్రేయర్లు, పవర్‌స్ప్రేయర్, పంట కోత యంత్రాలు, మల్టీ క్రాప్ క్రషర్, వరికోత యంత్రం తదితర అధునాతన యంత్రాలతో పాటు నీటి సరఫరా కోసం స్ప్రింక్లర్లు, జల ఫిరంగులు, బిందుసేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరాలన్నింటిని ట్రాక్టర్లకు అనుసంధానం చేసుకుని ఉపయోగించుకోవచ్చు. వ్యవసాయ శాఖ యాంత్రీకరణ పథకం కింద పెద్ద ఎత్తున రాయితీపై యాంత్రీకరణ ఉపకరణాలను అందచేస్తున్నది. వ్యవసాయాధికారులను సంప్రదించి రాయితీ



యంత్రంతో వరి నాటుతున్న రైతు

ధరలకు రైతులు కొనుగోలు చేసుకోవచ్చు. రాయితీపై జల ఫిరంగులు, స్ప్రింక్లర్లు, బిందుసేద్యం పరికరాలను ఆయా మండలాల్లోని సూక్ష్మ నీటిపారుదల పథకం ఏరియా అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తారు. సాగులో యాంత్రీకరణ పద్ధతులను అవలంభిస్తే వ్యవసాయ రంగం లాభాల బాట పట్టే అవకాశం ఉంది. ఇందుకు అవసరమైన ఆచరణాత్మక ప్రణాళికలు రైతులకు ఎంతో అవసరం.

–న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)

సజ్జ పంటలో సస్యరక్షణ

జొన్న తర్వాత రైతులు అధికంగా పండించే పంట సజ్జ. ఇందులో మంచి పోషకాలు ఉంటాయి. ప్రస్తుతం పంటల సాగు మొదలై నెలన్నరకు పైగా అవుతుందని, సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు.

పచ్చకంకి లేదా వెర్రికంకి తెగులు: తెగులు సోకిన మొక్క కాండంపై పూర్తిగా లేదా అసంపూర్తిగా ఆకులుగా మారిన పుష్పగుచ్ఛం ఏర్పడుతుంది. తెగులు లక్షణాలు మొదట లేత మొక్కలపై, 3-4 ఆకులు వేసే దశలో కనిపిస్తాయి. తెగులు సోకిన మొక్కలు పసుపురంగు లోకి మారుతాయి. గాలిలో తేమ అధికంగా ఉంటే ఆకుల అడుగుభాగంలో తెల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. తెగులు తీవ్రదశలో మొక్కలు గిడసబారి 30 రోజులు లోపు చనిపోతాయి. తెగులు సోకిన మొక్కలో కంకులు పూర్తిగా లేదా పాక్షికంగా ఆకుపచ్చని ఆకులుగా మారిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనానికి 6 గ్రా. అప్రాన్ ఎస్.డి 35 మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను ఏరి కాల్చివేయాలి. విత్తిన 21 రోజులకు తెగులు సోకే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు 5 శాతం మించి ఉంటే రిడోమిల్ (25డబ్ల్యూపీ) లీటరు నీటికి 1 గ్రా. వంతున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

తేనెబంక తెగులు: తెగులు సోకిన కంకి నుంచి గులాబి లేదా ఎర్రరంగుగా ఉన్న తేనె వంటి చిక్కటి ద్రవం బొట్లు బొట్లుగా కారుతుంది. ఈ ద్రవంతో శిలీంధ్ర బీజాలు ఏర్పడతాయి. మొక్కలు పుష్పించే దశలో మబ్బుతో కూడిన ఆకాశం, వర్షపు తుంపరలు, వాతావరణం చల్లగా ఉండటంతో ఈ తెగులు వ్యాప్తికి దోహదం చేస్తుంది. దీని నివారణకు విత్తనాలను లీటరు నీటికి 20 గ్రా. ఉప్పు కలిపిన నీటి ద్రావణంలో శుద్ధి చేసి, ఆరనిచ్చి కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ మందు కలిపి విత్తన శుద్ధి చేయాలి. పైరు పూతదశలో మాంకోజబ్ 2.5 గ్రా. లేదా కార్బండిజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేయాలి.



వెర్రికంకి తెగులు సోకిన మొక్క

తేలిక నేలల్లో చెదల నివారణకు ఎకరాకు 8 కిలోల 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని దుక్కిలో వేసి కలియదున్నాలి. లేత మొక్క దశలో మిడతల నుంచి పంటను కాపాడటానికి 5 శాతం కార్బరిల్ పొడి లేదా 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని ఎకరాకు 8-10 కిలోలు చొప్పున చల్లాలి.

–న్యూస్‌టుడే, హాలహర్వి.

ఇక విందాం.. ఆసక్తితో నేర్చుకుందాం

నేటి నుంచి రేడియో పాఠాలు పునఃప్రారంభం
అధికారుల పర్యవేక్షణతోనే ప్రయోజనం


రేడియో పాఠాలు వింటున్న చిన్నారులు

గుణాత్మక విద్యను అందించడానికి ప్రభుత్వం వినూత్న పథకాలు తీసుకొస్తోంది. చిన్నారులకు వినోదంతో పాటుగా విజ్ఞానాన్ని అందించి, వారిలో సృజనాత్మకత పెంపొందించాలన్న లక్ష్యంతో రేడియో పాఠాలు అమలు చేస్తోంది. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో అన్ని ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల కోసం 'విందాం.. నేర్చుకుందాం' పేరుతో ప్రసారమయ్యే రేడియో పాఠాలు విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించి అభ్యసన స్థాయిని పెంచడంలో తోడ్పడుతున్నాయి. మొదటి విడతగా 3-5 తరగతులకు ప్రణాళికను విడుదల చేశారు. ఇందులో కథలు, ఆటపాటలతో కూడిన విద్య కావటంతో విద్యార్థులు రేడియో పాఠాలను శ్రద్ధగా వినేవారు. పలు కారణాలతో ఈ ఏడాది ఆలస్యంగానైనా ప్రసారాలను పునఃరుద్ధరించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అందుబాటులోకి తీసుకొచ్చింది.

- న్యూస్‌టుడే,కర్నూలు విద్య

ప్రభుత్వ పరిధిలో 1,914 ప్రాథమిక పాఠశాలల్లో 1,52,492 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో మొదటగా 3-5తరగతి విద్యార్థులకు విదాం-నేర్చుకుందాం రేడియో ప్రసారాలను ప్రారంభిస్తున్నారు.

సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు ఆల్‌ఇండియా రేడియో స్టేషన్ నుంచి చిన్నారులకు నిర్దేశించి పాఠాలు ప్రసారం చేయడానికి ప్రభుత్వం ప్రసారభారతితో ఒప్పందం కుదుర్చుకున్నారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆగస్టు 21 నుంచి నవంబరు 21 వరకు ఏకధాటిగా 53 రోజుల పాటు (సెలవులు మినహాయింపు) రేడియో ప్రసారాలు వస్తాయి.

ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన రేడియో ప్రసారాల ప్రణాళికను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంతర్జాలంలోని డౌన్‌లోడ్ చేసుకొని చిన్నారులను చైతన్య పరచాల్సి ఉంది.

పాఠశాలల్లోని రేడియోలు పనిచేస్తున్నాయా? లేదా...? సరిచూసుకొని ఒకవేళ రెడియో పనిచేయకపోతే వెంటనే పాఠశాల నిధులతో మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలన్న ఆదేశాలు ఉన్నాయి.

ప్రతిరోజూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను ఎంపికచేసి ప్రణాళిక ప్రకారం సకాలంలో రేడియో పాఠాలు ప్రసారమయ్యేలా చర్యలు తీసుకోవాలి.

రేడియో పాఠాల అమలుతీరును సెక్టోరల్ ఆఫీసర్, ఎంఈవో, సీఆర్‌పీ, ఎస్‌ఆర్‌జీ, డీఎల్ఎంటీ పర్యవేక్షిస్తూ పరిశీలించాలి.

అధికారుల తనిఖీ సమయంలో రేడియో పాఠాలపై ప్రతినెలా ఐదుగురు ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి నివేధికలు పంపాలి.

పాఠాల ప్రణాళిక ఇలా..

ఈ సోమవారం నుంచి రేడియో పాఠాలు ప్రారంభం కానున్నాయి. ఏదైన కార్యక్రమాన్ని ప్రారంభించే ముందు దేవుని పాటతో ఆరంభించడం సంప్రదాయంగా వస్తుంది. మొదటిరోజున వినాయక చవితి విశిష్టత గురించి వివరించనున్నారు. 22న ఆంగ్లం, 23న పరిసరాల విజ్ఞానం, 24న ఎంత ఎక్కువ, 28 గోపిడప్ప, 29 ఆంగ్లం, 30 జంతువులు-నివాసాలు, 31న స్మార్ట్‌టేబుల్స్, సెప్టెంబరు 1న టీటీపీ, 4న సహకారం, 5 ఎలుక విందు, 7 ఆవరణాలు-ప్రహరీలు, 8 కలసివుంటే కలదు సుఖం, స్నేహం, 11 కూడిక, 12 లర్నింగ్ ఇంగ్లిషు ఫన్, 13 మనచుట్టూ ఉండే మొక్కలు, 14 మనం ఏమేమి తింటాం, 15 చిలుక పలుకు, తృప్తి, 18 మానవ భాగాలు-సమావన సమూహాలు, 19 మనసు ఉంటే మార్గముంది, అక్టోబరు 3న టీటీపీ, 4 తీసివేత, 5న లర్నింగ్ ఇంగ్లిషు ఫన్, 6న మనం ఏమి తిన్నాం, 9 అన్నం, 10 టీటీపీ, 11న ఇంగ్లిషు, 12న జెండా వెంకయ్య, 13 మన గ్రామం, 16 చిలుక సందేశం, టీటీపీ, మోరల్‌స్టోరీ, 17 సంఖ్యలు తెలుసుకుందాం, 20న ఇంగ్లిషు, 23న చెట్లను పెంచుదాం, 24న దారి తెలుసుకుందాం, 25న టీటీపీ, మోరల్ స్టోరీ, 26న పెద్దసంఖ్యలు, 27న ఇంగ్లిషు, 30 టీటీపీ, మోరల్ స్టోరీ, ఆటాడుకుందాం, 31న నీడ ఖరీదు, నవంబరు 2న ఇంగ్లిషు, 3న ప్రభుత్వ సంస్థలు, 6న గుణకారం, 7న టీటీపీ, మోరల్ స్టోరీ, 8 మనగ్రామం, 9న ఇంగ్లిషు, 10న టీటీపీ, 13న మార్పు, 15న పుస్తకాలు, 16న ఎలా జోడిద్దాం, 17న టీటీపీ, 20న వినండి, 21న ఇంగ్లిషు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మూగబోయిన 'మీనా ప్రపంచం'

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 'మీనాకి దునియా' పేరిట ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాజీవ్‌విద్యా మిషన్ ఉమ్మడి రాష్ట్రంలో 2012-13లో మీనా ప్రపంచం కార్యక్రమాలను ప్రారంభించింది. 6,7,8 తరగతి విద్యార్థులను ఉత్తేజ పరచడానికి అనేక అంశాలను జోడించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడం, సాధికారత సాధించడం...పాఠశాలకు విద్యార్థులు గైర్హాజరు కాకుండా చూడటం దీని ముఖ్య ఉద్దేశంగా ఉండేది. అప్పట్లో ప్రసారాల కార్యక్రమాల అమలుకు విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకటి నుంచి మూడు రేడియోల వరకు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమం కనుమరుగవడంతో రేడియోలు మూలనపడ్డాయి.

నిలిపివేతతో ఇబ్బందులు ఇలా..

రేడియో పాఠాలు ప్రసారం కాకపోవడంలో పలు పాఠశాలల్లో రేడియోలను అటకెక్కించారు. కొన్ని పాఠశాలల్లో మరమ్మతులకు గురయ్యాయి. వీటిని మరమ్మత్తులు చేయించటం గాని, వాటి స్థానంలో కొత్తవి కొనటంగాని చేయలేదు. ప్రారంభంలో 1-5 తరగతులకు 'విందాం-నేర్చుకుందాం', 6-8 తరగతులకు 'మీనా' రేడియో ప్రసారాలను నిర్వహిస్తారు. కొన్ని రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిలుపుదల చేయడంతో విద్యార్థులు కొంతవరకు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు రేడియో ప్రసారాలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్ని పాఠశాలల్లో వినియోగించుకుంటారన్నది ప్రశ్నార్థకంగా మారింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు నూరుశాతం రేడియో పాఠాలను వినిపిస్తేనే కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుంది.

విద్యార్థుల్లో ఆసక్తి



తేనే సాయిబాబ, హెచ్ఎం, కస్తూరి నగర్

రేడియో పాఠాలు సులువుగా అర్థమవుతుండటంతో విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. మధ్యలో ప్రసారాలు లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. విద్యార్థులు వాటికోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. రేడియో పాఠాలను పునఃప్రారంభించటంతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

తప్పకుండా వినిపించాలి



హుసేన్‌సాహెబ్, ఏఎంవో, ఎస్ఎస్ఏ

ప్రతి పాఠశాలలో విద్యార్థులకు రేడియో పాఠాలు తప్పనిసరిగా వినిపించాలి. వీటితో విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులకు కూడా ప్రయోజనం ఉంటుంది. సంబందింత ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్దేశించిన ప్రణాళిక సమయంలో ఆకస్మిక తనిఖీలు చేపడతాం. పాఠశాలలోనైనా రేడియో లేకపోయినా, విద్యార్థులకు వినిపించకపోయినా చర్యలు తప్పవు.

నంద్యాల యువకుడు కిలిమాంజారో పర్వతారోహణ

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణం డేనియాల్పురం కాలనీకి కె.దేవదానం, ఉమాదేవి దంపతులకు చెందిన యువకుడు మనోహర్ ఆఫ్రికా ఖండంలో టాంజానియా దేశంలోని ఎత్తయిన శిఖరమైన కిలిమాంజారో పర్వతాన్ని ఈ నెల 15న ఉదయం 6:30 చేరుకుని, ప్రస్తుతం తిరుగు ప్రయాణం చేపట్టారు. జిల్లా నుంచి ఇతర దేశాలకు వెళ్లి అత్యంత ఎతైన పర్వతాలను అధిరోహించి ఇప్పటి వరకు ఎవరూ సాహసం చేయలేదు. ఖండాంతర స్థాయిలో కిలిమాంజారో పర్వత శ్రేణులను ఎంచుకుని అధిరోహించి రావడం ఇదే ప్రథమం. నంద్యాల వాసి కావడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇందుకుగాను అయ్యే ఖర్చును రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ సాయం చేయడంతో తన సంకల్పాన్ని సాకారం చేసుకున్నట్లు తెలిపారు.




జాతీయ జెండాతో పర్వతంపై మనోహర్

దశలవారీగా ఉర్దూ వర్సిటీ అభివృద్ధి

వచ్చే ఏడాది మరిన్ని కొత్తకోర్సుల ఏర్పాటు రిజిస్ట్రార్ సత్తార్ సాహెబ్

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: డా.అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంలో అనేక ఫలితాలు సాధించామని వర్సిటీ రిజిస్ట్రార్ సత్తార్ సాహెబ్ సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్సిటీ అభివృద్ధి కార్యక్రమాలపై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లు సమీపంలో 144.34 ఎకరాల స్థలం కేటాయించిందని, మొదటిదశ నిర్మాణాలకు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిందని, ముందుగా విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అకడమిక్, పరిపాలన, బాలికల వసతిగృహాల నిర్మాణాలు చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అనుభవం గల అధ్యాపకుల నియామకానికి బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆచార్య ఖాసీం అలీఖాన్‌ను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా, అలీఘడ్ ముస్లిం వర్సిటీలో డెక్కన్ స్టడీస్ విభాగం ఆచార్యులుగా పనిచేస్తూ విశ్రాంతి పొందిన ముస్తఫాను ఆంగ్లం, ఉర్దూ శాఖల బలోపేతానికి ఎంపికచేసినట్లు చెప్పారు. వర్సిటీలో ప్రారంభంలో 82 మంది, ప్రస్తుతం రాష్ట్రంలోని 91 మందితో ప్రవేశాలు పెరిగాయని, విద్యార్థుల అభిరుచి మేరకు వచ్చే ఏడాది మరో రెండు కోర్సులు, డిప్లొమో కోర్సులు ప్రవేశపెట్టాలని నిర్ణయించామన్నారు. వర్సిటీకి స్థానికంగా ఏడాదికి మాత్రమే అనుమతి ఉందని, త్వరలో నూతన భవనం తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నామన్నారు. ప్రస్తుత అవసరాకలు 15 గదులు అవసరమని గుర్తించామని ఆయన వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాలు, వర్సిటీ సమాచారం www.ahuuk.ac.in అంతర్జాలంలో పొందుపరుస్తున్నామని, పాలకమండలి ఆమోదంతో వర్సిటీ ఎంబ్లెమ్‌ను అధికారికంగా విడుదల చేస్తామన్నారు. ఉన్నతవిద్యను అభ్యసిస్తున్న 52 మంది విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకారవేతనాలు, రుసుం పునఃచెల్లింపులు మంజూరు చేసిందన్నారు. ఇక్కడ బోధించే అధ్యాపకులు జాతీయ, అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొంటున్నారని, 2017 ఫిబ్రవరిలో చేపట్టిన జాతీయ మహిళా పార్లమెంట్‌లో విద్యార్థులు పాల్గొని వర్సిటీకి గుర్తింపు తీసుకొచ్చారన్నారు.


సత్తార్ సాహెబ్